
J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 23 08.11.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# ట్రంప్ ఈజ్ బ్యాక్!

**యస్!..** ట్రంప్ ఈజ్ బ్యాక్.. ట్రంప్ మళ్ళీ గెలిచారు! అమెరికా చరిత్రలో రెండవసారి అధ్యక్షుడైన రెండవ వ్యక్తిగా డోనాల్డ్ ట్రంప్ రికార్డు సృష్టించారు. అనేక అవమానాలు, అంతులేని అనుమానాలు, అనుకోని అవరోధాలు, అర్థంలేని ఆరోపణలు... అన్నీ అధిగమించి మళ్ళీ అగ్రరాజ్యం అధ్యక్ష పీఠాన్ని రెండోసారి 78సంవత్సరాల డోనాల్డ్ ట్రంప్ అధిరోహించ నున్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ఆయన జనవరి 20, 2025న బాధ్యతలు చేపడతారు.

ట్రంప్ విజయం వల్ల భారతదేశానికి, అమెరికాలో ఉన్న భారతీయులకి లాభమా... నష్టమా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, భారత ప్రధాని నరేంద్ర మోడీతో ట్రంప్‌కి ఉన్న సాన్నిహిత్యం, స్నేహబంధం వలన అంతా మంచే జరుగుతుం దన్న ఆశాభావాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు వ్యక్తం చేస్తున్నారు.

## ట్రంప్ - కమల హారిస్‌ల మధ్య ఉత్కంఠ భరితంగా సాగిన పోరు..!

ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠను రేపిన మొన్నటి ఎన్నికల్లో అపూర్వ విజయం సాధించి ట్రంప్ తన సత్తా చాటుకున్నారు. అత్యధిక రాష్ట్రాల్లో విజయదుందుభిలు మోగించి..మెరుపులు మెరిపించి..తనే అమెరికా మెరికనని నిరూపించుకున్నారు. గత ఎన్నికల్లో ఓడినా..ఇప్పుడు పోరాడి గెలిచి వీరుడనిపించుకున్నాడు. డెమోక్రాట్ల అభ్యర్థిగా పోటీలో ఉన్న కమలా హారిస్‌పై ఆధిక్యత సాధించి, రిపబ్లికన్ల అధ్యక్షునిగా.. తిరుగులేని నేతగా నిలిచారు. అంతేకాదు, ఒక విడత విరామం తర్వాత మరోసారి అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన సరికొత్త ఘనత కూడా ఆయనదే. దాదాపు 20 ఏళ్ళ తర్వాత ఎలక్టోరల్ ఓట్లతో పాటు పాపులర్ ఓట్లనూ అత్యధికంగానే గెలుచుకున్న రిపబ్లికన్ అధ్యక్షుడిగా కూడా.. డొనాల్డ్ ట్రంప్ విశేషఖ్యాతిని సాధించుకున్నారు. మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో ఇప్పటికే ఆయన 292ఓట్లను సాధించారు. ఫలితాల వెల్లడి పూర్తయ్యేసరికల్లా ఆయన కనీసం 300 ఎలక్టోరల్ ఓట్లను అవలీలగా సాధిస్తారనే అంచనాలున్నాయి. ఆయన విజయంతో అమెరికాలో ఆనందోత్సవాలు మిన్నంటుతున్నాయి.

10లో




### కూటమి పాలనలో...

# కాక మొదలయ్యింది!

- భరతం పడతానంటున్న బాబు
- పవర్ చూపిస్తానంటున్న పవన్

10లో

# శ్రీవారి సేవలో మూడవసారి ప్రశాంతిరెడ్డి

- ట్రస్టుబోర్డు సభ్యురాలిగా బాధ్యతలు

3లో





# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## • జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి ఫరూక్



ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ చెప్పారు. ఈనెల 3న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని, ఇది మంచి ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి సగౌరవంగా ఆహ్వానం పలకడంలో పొరపాటు జరిగిందని, ఇది బాధాకరమైన విషయమని, దీనికి అందరం చింతిస్తున్నామని అన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తమ నియోజక వర్గాల్లోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు.

### వేమిరెడ్డికి క్షమాపణలు - మంత్రి ఆనం

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, ఎంపీ వేమిరెడ్డి విషయంలో జరిగిన పొరపాటుకు అందరి తరఫునా క్షమాపణ చెప్పున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధుల పట్ల అగౌరవంగా వ్యవహరిస్తే ఊరుకోమని, వారిని తప్పకుండా గౌరవించాలని అధికారులనుద్దేశించి అంటూ, ఎంపీ వేమిరెడ్డి విషయంలో పశ్చాత్తాప పడుతున్నామని, అందరం బాధపడుతున్నామని, ఇలాంటి లోపాలు మళ్ళీ జరగకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### త్వరలోనే విమానాశ్రయం - మంత్రి నారాయణ

మంత్రి నారాయణ మాట్లాడుతూ, దగదర్తి వద్ద విమానాశ్రయ నిర్మాణానికి కృషి జరుగుతోందని, త్వరలోనే ఆ కల సాకారం అవుతుందని చెప్పారు. అదేవిధంగా, నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుపై ఎస్పీకి ఆదేశాలిచ్చామన్నారు. చింతారెడ్డి పాలెం, కనుపర్తిపాడు కూడళ్ల వద్ద ఫ్లైఓవర్ వంతెల నిర్మాణానికి ఇప్పటికే ఎన్‌హెచ్ అధికారులతో చర్చించామని తెలిపారు.

### అక్రమాలపై విచారణ చేపట్టండి - ఎమ్మెల్యే సోమిరెడ్డి

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీటిపారుదల పనులపై విచారణ చేపట్టాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. గత ఐదేళ్లలో ఎన్ని నీటిగుంటలు తవ్వారో, ఎన్ని సూక్ష్మ బిందు సేద్య పరికరాలు ఎంతమందికి ఇచ్చారో, ఎన్ని నిధులు ఖర్చు చేశారో తెలపాలని అధికారులను ఆయన నిలదీశారు. తమ నియోజకవర్గంలో గిరిజనుల పరిస్థితి దయనీయంగా ఉందని, కనీసం వారికి ఆధార్ కార్డులు కూడా లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని, ఈ దుస్థితి గమనించి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి తగు న్యాయం చేయాలని ఆయన సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

### లష్కర్లకి జీతాలు ఇవ్వండి - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

జిల్లాలో నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న లష్కర్లకు కొంతకాలంగా జీతాలు ఇవ్వడం లేదని, కొంతమందిని తొలగిస్తున్నారని, ఆ చిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో, ఓటర్ల జాబితాను సక్రమంగా తయారుచేయాలని అధికారులకు సూచించారు. చాలా గ్రామాలలో నిచ్చెనలు లేకపోవడంతో స్థానిక పంచాయతీ సిబ్బంది ఓవర్ హెడ్ ట్యాంకులు ఎక్కి శుభ్రం చేయలేకపోతున్నారని, దాంతో గత్యంతరం లేక ప్రజలు కలుషిత నీళ్లే తాగాల్సి వస్తోందన్నారు. కోవూరులో ఇరిగేషన్ పనులకు రూ. 6.30 కోట్లు మాత్రమే మంజూరు చేశారని, మరింత ఎక్కువ నిధులు కేటాయించి కాలువల్లో పూడికతీత పనులను ఎక్కువగా చేపట్టాలని కోరారు.

### బ్రిడ్జిలను నిర్మించండి - ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు పరిధిలో ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేందుకు పొట్టేపాలెం కలుజు వద్ద, కొత్తూరు సమీపంలోని తెలుగుగంగ కార్యాలయం వద్ద, నెల్లూరు సమీపంలో ఇరుకళలమ్మ ఆలయం కూడలి వద్ద వంతెనలను నిర్మించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఆ మూడు వంతెనలను నిర్మించేందుకు కృషి చేయాలని ఆయన మంత్రులను కోరారు. ఆమంచర్ల వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 562 ఎకరాలను సేకరించి రైతులకు రూ. 50 కోట్ల మేర పరిహారం కూడా చెల్లించడం జరిగిందని, అయితే అటవీశాఖ వారు చెప్తున్న అడ్డంకులపై మంత్రులు, కలెక్టర్ దృష్టిసారించి ఆ పారిశ్రామికవాడ నిర్మాణం పూర్తిచేస్తే దాదాపు 10వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని కోటంరెడ్డి చెప్పారు. కొమ్మలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మాణాన్ని కూడా పూర్తిచేయాలని కోరారు.

### రాళ్లపాడుకు నీళ్ళివ్వండి - ఎమ్మెల్యే ఇంటూరి

సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు రిజర్వాయర్‌కు అవసరమైన నీటిని విడుదల చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ప్రతిసారీ అరకొరగా ఒక అర టిఎంసి మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారని, ఈసారైనా కనీసం 1.5 టిఎంసిల నీటిని విడుదల చేస్తే రాళ్లపాడు ఆయకట్టు కింద రైతాంగానికి ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.

ఈ సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రూపాయలకే ఇసుక!

## ○ శుభవార్త చెప్పిన మంత్రి నారాయణ



రాబోయే రెండు వారాల్లోనే ఇసుక వెయ్యి రూపాయలకే వస్తుందని మంత్రి నారాయణ ప్రజలకి శుభవార్త చెప్పారు. నెల్లూరు 3వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో నవంబరు 1న ఆయన లబ్ధిదారులకి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తుండడంతో మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. వైకాపా వాళ్ళు ఖజానా ఖాళీ చేసినప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1వ తేదీనే అవ్వా-తాతలకు ఫించన్లు అందిస్తూ.. వారి కళ్ళలో ఆనందం చూస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి 'సూపర్ సిక్స్' పథకాలను కూడా అమలుచేస్తున్నారని తెలిపారు. ట్రాక్టర్ ఇసుక రూ. 4వేల నుంచి 5వేలు వరకు ఉంటే... ఒక్కసారిగా రూ. 2వేల నుంచి 1500లోపే తగ్గిపోయిందని, ప్రస్తుతం ఇసుక రీచ్‌లకు దగ్గరగా ఉంటే రూ. 1500లు, దూరంగా ఉంటే రూ. 2వేల లోపు మాత్రమే లబ్ధిదారులకు ఖర్చవుతోందని, ఇసుక ధర తగ్గించినా వైకాపా నాయకులు ధర్నాలు ఎందుకు చేస్తున్నారో విడ్డూరంగా ఉందని మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇసుక ధరను వెయ్యి రూపాయలకు తగ్గించాలన్న ఆలోచనతోనే ప్రజలకి దగ్గరగా ఉండే ఏరియాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేయడం జరుగుతోందన్నారు.

### దీపావళి సంబరాల్లో పాల్గొన్న మంత్రి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా దీపావళి వేడుకలను మంత్రి నారాయణ కార్యకర్తలతో కలిసి ఆనందోత్సవంగా నిర్వహించుకున్నారు. నెల్లూరు నగర నియోజక వర్గ పరిధిలోని మూడో డివిజన్లో దీపావళి రోజున టీడీపీ కార్యకర్త లక్ష్మి నివాసంలో జరిగిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. లక్ష్మీ కుటుంబసభ్యులతోపాటు టీడీపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి టపాకాయలు పేల్చి ఆనందించారు.

### అమరజీవి ఆత్మార్పణతోనే ఆంధ్రరాష్ట్రం



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే మన ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని, ఆయన త్యాగనిరతి విస్మరించలేనిదని మంత్రి నారాయణ ప్రశంసించారు. నవంబరు 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మరో ఆరు నెలల్లో.. రెండో దశ క్యాన్సర్ స్క్రీనింగ్

## -ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



కోవూరును క్యాన్సర్ రహిత నియోజకవర్గంగా చేయాలన్నదే తన సంకల్పమని, ఆ లక్ష్య సాధనలో భాగంగానే కనీస వైద్య సదుపాయాలు లేని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో అత్యాధునిక క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని. మరో ఆరు నెలల్లో రెండోదశ క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా జరుగుతుందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చెప్పారు. విడవలూరు మండల కేంద్రంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా, తిరుపతి స్విమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్స్‌ను ఆమె పర్యవేక్షించారు. ప్రాథమిక దశలో గుర్తించి సకాలంలో వైద్య చికిత్సలు చేయించుకుంటే క్యాన్సర్ నియంత్రించ వచ్చని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలో కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చి, కొడవలూరు మండలాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహించామని, విడవలూరు మరో నాలుగైదు రోజుల పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించి క్యాన్సర్ స్క్రీనింగ్స్ చేయించడంలో ఆరోగ్య కార్యకర్తల కృషి అభినందనీయమన్నారు. భయాందోళనలు వీడి 35 ఏళ్ళు పైబడిన ప్రతి మహిళ ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఒకవేళ క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారణ అయితే తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యచికిత్సలు పొందవచ్చని తెలిపారు.

### విపిఆర్ ఫౌండేషన్ ద్వారా.. తుమ్మగుంట అయ్యప్ప ఆలయాభివృద్ధికి కృషి

విడవలూరు మండలం తుమ్మగుంట గ్రామంలోని ప్రసిద్ధమైన అయ్యప్పస్వామి దేవాలయాన్ని ఇటీవల ప్రశాంతిరెడ్డి సందర్శించారు. ఆలయం అభివృద్ధికి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా కృషిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# త్యాగధనుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు

## • చెన్నైలో ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మత్యాగం ఏనాటికీ విస్మరించలేనిదని, ప్రతి ఒక్కరు ఆ మహనీయుని స్మరించుకోవాలని, అమరజీవి ఆశయాల బాటలో అందరూ నడవాలని వక్తలు ఆకాంక్షించారు. తమిళనాడులోని చెన్నై నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అనుబంధ సంస్థ.. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు అమరజీవి సేవలను గుర్తుచేసుకున్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కమిటీ ఛైర్మన్ కె.అనిల్ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ డాక్టర్ నూకసాని బాలాజీ, తమిళనాడు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.శేఖర్ ముఖ్య అతిథులుగా, కెన్సెస్ గ్రూప్ సీఇవో ముత్తినేని కృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగంటి ఎరుకలయ్య విశిష్ట అతిథులుగా పాల్గొని శ్రీ పొట్టి శ్రీరాములి సేవానిరతిని ప్రస్తుతించారు.

## '108 అంబులెన్సు'ల నిర్వహణలో..

# భారీ కుంభకోణం

### వైకాపా హయాంలో కోట్లు దోచేశారంటూ ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపణలు



వైకాపా హయాంలో '108 అంబులెన్సు'ల నిర్వహణ వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిపోయిందని, ఆ బాధ్యతలను చేజిక్కించుకున్న అరబిందో కంపెనీ వందలాదికోట్లు దోచుకుందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రాణాపాయంలో ఉన్నవారిని సకాలంలో ఆసుపత్రులకు తరలించడంలో, గోల్డెన్ అవర్ పాటించడంలోనూ ఆ కంపెనీ విఫలమైందంటూ కాగ్ నివేదిక స్పష్టం చేసిందని, అయినా అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని విమర్శించారు. 2011నుంచి 2016 వరకు అంబులెన్సుల నిర్వహణ బాధ్యతను జీవీకే సంస్థ సమర్ధవంతంగా నిర్వహించిందని, అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి 2021 వరకు కూడా అదే సంస్థను పొడిగించిందని, అయితే, వైకాపా అధికారంలోకి రాగానే జీవీకే సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసిందని ఆయన వివరించారు. జీవీకే సంస్థ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కో అంబులెన్సుకు నెలకు రూ.1.31 లక్షలైతే, అరబిందో కంపెనీకి రూ.1.78 లక్షలు చెల్లించారని, కొత్త అంబులెన్సుకైతే నెలకు రూ.2.21 లక్షలకు పెంచారని, నిర్వహణ ఖర్చుల్లో చేసిన ఆ మార్పులతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ.800 కోట్లకు పైగా భారం పడిందని ఆయన వివరించారు. వీటన్నిటిపై విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఉపాధ్యాయులకు.. బోధనేతర పనులు చెప్పొద్దు

- బీటీఏ విన్నపం

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పేది లేదని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ విధానాలనే ఇప్పటి ప్రభుత్వం కూడా అమలు చేయడం ఏమిటని బీటీఏ నాయకులు ప్రశ్నించారు. గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయులు అనేకరకాల యాప్‌లతో నిత్యం సతమతమవుతూ విధులు నిర్వహించాల్సి వచ్చిందని, దీంతో కొంతమంది ఉపాధ్యాయులు మానసిక వత్తిడితో అనారోగ్యాల పాలయ్యారని బీటీఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మణిసుబ్బు, ప్రసాద్‌లు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా రెసిడెన్షియల్ శిక్షణలో అపార్, నామినల్ రోల్స్ తదితర పనులతో ఉపాధ్యాయులు పనివత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైనా ఉపాధ్యాయులకు ఇస్తున్న ఎఫ్ఎల్ఏఎన్, లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఏలూరు జిల్లా అగిరిపల్లిలో ఆ శిక్షణకు హాజరైన ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటరత్నకుమార్ ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వారు కోరారు.

### ఆనం చొరవతో..

## దువ్వూరు కాలువకు నీళ్ళు

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఎట్టకేలకు సంగం మండలంలోని దువ్వూరు కాలువకు నీళ్లొచ్చాయి. ఈనెల 6న నీటిపారుదల శాఖ బుచ్చి సబ్‌డివిజన్ డీఇ పెంచలయ్య, సంగం సెక్షన్ ఏఇ వినయ్‌కుమార్ దువ్వూరు కాలువ రెగ్యులేటర్ వద్ద పూజలు చేసి, వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

# శ్రీవారి సేవలో మూడవసారి ప్రశాంతిరెడ్డి

- ట్రస్టుబోర్డు సభ్యురాలిగా బాధ్యతలు

కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సేవా భాగ్యం మరోసారి ప్రశాంతమ్మకు లభించింది. ముచ్చటగా మూడోసారి తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలిగా అటు ఆ దేవదేవునికి, ఇటు భక్తజనులకు సేవ చేసే అదృష్టం ఆమెకు కలిగింది. ప్రముఖ ఆధ్యాత్మిక-సామాజిక సేవా పరాయణులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులకు నిజంగా అది పూర్వజన్మ సుకృతమే.

గత ప్రభుత్వ హయాంలో టీటీడీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా కొత్త పాలకమండలి నియామకంతో టీటీడీని ప్రక్షాళన చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మెన్‌గా టీవీ5 ఛైర్మెన్ బీఆర్ నాయుడును నియమించారు. అదేవిధంగా, శ్రీవారి భక్తురాలు.. కోవూరు నియోజకవర్గం శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాలక మండలి సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈనెల 6వ తేదీ బుధవారం నాడు ఛైర్మెన్ బీఆర్ నాయుడు, ఇతర సభ్యులతో కలసి ప్రశాంతమ్మ టీటీడీ బోర్డు సభ్యురాలిగా ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో




నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు తనయుడు అర్జున్‌రెడ్డి, కుమార్తె నీలిమారెడ్డి, అల్లుడు సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీటీడీ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం



టీటీడీ పాలక మండలి ఛైర్మెన్‌గా బీఆర్ నాయుడు, సభ్యులుగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర్‌గౌడ్, జాస్తి పూర్ణసాంబశివరావు, ఎం.ఎస్.రాజు, నర్సిరెడ్డి, బూంగునూరు మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ, ఆనంద్‌సాయి, జానకి దేవి తమ్మిశెట్టి, ఆర్.ఎన్.దర్శన్, ఎం. శాంతారామ్, ఎస్.నరేష్‌కుమార్, డాక్టర్ ఆదిత్ దేశాయ్, ఎక్స్‌అఫిషియో సభ్యునిగా దేవాదాయశాఖ సెక్రటరీ సత్యనారాయణలు ప్రమాణస్వీకారం చేశారు. వీరిచే టీటీడీ అడిషనల్ ఈఓ సి.హెచ్.వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించగా, రంగనాయకుల మండపంలో వారికి వేదపండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు అందించారు. అధికారులు శ్రీవారి చిత్రపటం, డైరీలు, క్యాలెండర్లు అందజేశారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డెప్యూటీ ఈవోలు పాల్గొన్నారు.

## 94వ జయంతి




### కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు, లాయర్ వార్తాపత్రిక

లాయర్
నవంబర్ 08, 2024

# జీవితాలను చేదుమయం చేస్తున్న.. 'తియ్యటి వ్యాధి'

'మా డాక్టరు అన్నం తినొద్దన్నాడు.. చపాతీలు కూడా తినకూడదంట!.. రాగులు, జొన్నలు, కొర్రలు, ఊదలు ఉడకబెట్టుకుని జావచేసుకుని తాగాలంట. ఏం జబ్బో ఏందో.. పండ్లు తినరాదంట, తీపు తగలకూడదంట, చేదుగా ఉండే మెంతులు, కాకరకాయలు తింటూ బతకాలంట. ఈ మాయదారి షుగరొకటి వచ్చి పడింది నా ప్రాణానికి.. బతికినంతకాలం మందులు మింగి చావాలంట''.. ఇలాంటి నిర్వేదపు మాటలు ఒకప్పుడు ఏ కొంతమందిలోనో వినపడేవి. ఇప్పుడు ఎక్కడబట్టినా ఇదే చర్చగా ఉంటోంది. దేశంలో ఒకప్పుడు షుగర్ పెద్దవయసున్న వాళ్లకి మాత్రమే వస్తుండేది. ఇప్పుడలా కాదు, చిన్నవయసు నుంచే బాల మధుమేహం. ఆడా మగా తేడా ఏంలేదు. పెద్దవాళ్లకు, ముసలివాళ్ళ దాకా షుగర్వ్యాధి ఎవ్వరినీ విడిచిపెట్టడం లేదు. ప్రపంచవ్యాప్తంగా కోటానుకోట్లమంది ఈ డయాబెటిస్ వ్యాధితో అవస్తలు పడుతున్నారు. ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫౌండేషన్ తన తాజా అధ్యయనంలో..ప్రతి పదిమందిలో ఒకరికి డయాబెటిస్ వస్తోందని, 2030 నాటికి ప్రపంచ మధుమేహవ్యాధిగ్రస్తుల సంఖ్య 53.7 కోట్లకు చేరవచ్చని హెచ్చరిస్తోంది. అంతేకాదు, ఈ వ్యాధి బారినపడి ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాదిమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని కూడా లెక్కలు కట్టింది. మనదేశంలో కూడా అదే దుస్థితి. ఇటీవల వచ్చిన 'లాన్సెట్' జర్నల్ అధ్యయనం ప్రకారం.. మనదేశంలో కనీసం 10 కోట్ల మందికిపైగానే మధుమేహవ్యాధిగ్రస్తులున్నారట. అంతేకాదు, మరో 13 కోట్లమంది మధుమేహానికి దగ్గరలో (ప్రీ-డయాబెటిస్) ఉన్నారని కూడా ఆ పత్రిక అంచనా వేసింది. ఇప్పటికే షుగర్ వచ్చి బాధలుపడుతున్నవారు కోట్లాదిమంది ఉంటే, ఆ వ్యాధికి బాగా దగ్గరలో ఉన్నవారు (ప్రీ-బయాబెటిక్) మరెన్నో కోట్లమంది ఉంటున్నారని నిపుణులు చెప్తున్నారు. ఇంతగా విజృంభిస్తూ కోట్లాదిమంది జనజీవితాలను చేదుమయం చేస్తున్న వ్యాధి ఏదైనా ఉందంటే..అది ఒక్క మధుమేహవ్యాధేనని నిపుణులు బల్లగుద్ది మరీ చెప్తున్నారు.

'మధుమేహం' అనేది ఒక 'తియ్యటి వ్యాధి' (దీనినే 'చక్కెర వ్యాధి'..అనీ, ఆంగ్లంలో 'డయాబెటిస్' అనీ అంటారు) అని వైద్యులు అంటుంటారు. మనం తీసుకునే ఆహారం నుంచి తయారయ్యే గ్లూకోజ్ను వినియోగించుకోవడంలో శరీరం విఫలమయ్యే స్థితిని.. మధుమేహం అంటారు. శరీరం కార్బోహైడ్రేట్లను గ్రహించే స్థాయిని కోల్పోవడంతో ఈ వ్యాధి వస్తుందని, శరీరంలో తగినంత ఇన్సులిన్, హార్మోన్లు తయారుకాకపోవడం వల్ల ఆరోగ్యసమస్యలు వస్తుంటాయని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఈ వ్యాధి వచ్చిందంటే తియ్యటి పదార్థాలను అసలు తినకూడదు. ఇది అదుపులో లేకుంటే నరాల బలహీనత, కళ్ళు, కాళ్లు, పాదాలు, గుండె, కిడ్నీలు వగైరా ముఖ్యమైన అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది కనుక, వ్యాధిగ్రస్తులు మరింతగా ఆందోళన చెందుతున్నారు. ఏమి తింటే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని నిరంతరం భయపడుతూనే ఉన్నారు. హాయిగా ఇష్టం వచ్చింది తిని, రోజంతా కష్టపడి పనిచేసే పాతకాలపు రోజులు పోయాయి. శారీరక శ్రమ తగ్గిపోవడంతో, ఊబకాయం వంటి సమస్యలతో పాటు మధుమేహం విస్తరిస్తోంది. నేటి ఆధునిక కాలంలో మానవుని జీవనశైలి మారిపోవడం, ఆహారపుటలవాట్లు మారడం, జంక్ఫుడ్లు ఎక్కువగా తినడం, అధిక పనివత్తిడితో పాటు మానసిక ఆందోళనలు పెరగడం, తినే ఆహారంలో కల్తీలు ఎక్కువకావడం వంటివి మధుమేహం వంటి వ్యాధులకు ప్రధాన కారణాలుగా ఉంటున్నాయి. అయితే, మధుమేహం అన్నది వ్యాధి కాదనీ, అదొక ఆరోగ్య సమస్య మాత్రమేనని, దానిని అదుపులో పెట్టుకుంటే ఇబ్బంది ఉండదని వైద్య నిపుణులు భరోసా ఇస్తున్నారు. మధుమేహవ్యాధిగ్రస్తులకు అవసరమైన అన్నిరకాల చికిత్సలు, మందులు, ఇన్సులిన్ వంటివి కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి కనుక, వ్యాధిగ్రస్తులు నిరాశ పడకుండా, దానిని అదుపులో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని కూడా భరోసా ఇస్తున్నారు. దీని బారిన పడకుండా ఉండాలంటే, ఇకనైనా మంచి ఆహారపుటలవాట్లు, సంప్రదాయబద్ధమైన ఆహారం, నడక, వ్యాయామం, యోగా వంటివి పాటించడం మంచిది. 'మధుమేహం పట్ల అవగాహనే అసలైన మందు' కనుక, వ్యాధి వచ్చాక బాధలు పడేదానికంటే..అది రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమం. ఒకవేళ వచ్చినా భయపడకుండా చికిత్సలు చేసుకోవడం అవసరం. ప్రతి చిన్న విషయానికీ అనవసరమైన ఆందోళన చెందుతూ షుగర్ను పెంచుకోకుండా.. వైద్యుల సూచనలతో దానిని ధైర్యంగా నివారించుకునే ప్రయత్నం చేయడమే అన్నివిధాలా శ్రేయస్కరం!.. -(నవంబరు 14..ప్రపంచ మధుమేహ దినోత్సవం)

# వైసీపీ ఖాళీ కాదు!

వైసీపీ ఖాళీ అవుతుందా..? అని గత వారం మన 'లాయర్'లో వచ్చిన వార్తతో నేను ఏకీభవించడంలేదు. ఎందుకంటే... ఆ పార్టీలో రాజకీయాలలో స్వతహాగా ఎదిగిన నాయకులు ఎక్కువమంది లేరు. జగన్మోహన్రెడ్డి స్టాంపుతో లీడర్లుగా ఎదిగినవారే ఎక్కువ. రాజకీయ అనుభవంతో తమకి తాముగా ఎదిగినవారు, జనం నాడి ఎరిగిన వారూ చాలా తక్కువ. ఉన్న కొద్దిమంది అలాంటి నేతలు ఆ పార్టీలో ఇమడలేక వెళ్ళిపోయినా జగన్మోహన్రెడ్డి మళ్ళీ కొత్త వారిని తయారుచేసుకోగలడు. తాను కుక్కని నిలబెట్టినా గెలిపించుకోగలనన్న అతి విశ్వాసం కలిగిన నాయకుడు జగన్. అలాంటి ధీమా కలిగినవాడికి పార్టీలో సీనియర్ నాయకులు ఉంటే ఎంత.. పోతే ఎంత..! ఏమంటారు...?

– యం.విజయలక్ష్మి, మాజీ న్యాయమూర్తి, హైదరాబాదు.

# అన్ని రకాలుగా మోత మోగించిన దీపావళి!

గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి దీపావళి అన్ని రకాలుగా మోత మోగించింది. రేట్ల పరంగాను, శబ్దకాలుష్య పరంగానూ మోత దద్దరిల్లింది. "దీపావళి అంటే దీపాల పండుగ – మోతలెందుకు దండగ" అని అనేక స్వచ్ఛంధ సంస్థలు, సామాజిక కార్యకర్తలు ప్రజలని చైతన్యపరుస్తూనే ఉన్నారు. అయినా, జనం మారడంలేదు. ఈ ఏడాది కూడా పాత సంప్రదాయమే కొనసాగింది. సంబరాల రూపంలో దేశవ్యాప్తంగా వేలకోట్ల రూపాయలని ప్రజలు ఈ ఏడాది కూడా తగలబెట్టారు. దీపావళి జరుపుకోవద్దన్నది నా ఉద్దేశం కాదు. దీపాలు ఎక్కువ వెలిగించి, బాణాసంచా తక్కువ కాలిస్తే బాగుంటుందన్నది నా సూచన. టపాసులు అధికమోతాదులో కాల్చినందువల్ల అన్ని విధాలా నష్టపోయేది మనమే. వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యంతో ఒళ్ళు గుల్లవుతుంది. ఆకాశాన్నంటే ధరలతో ఇల్లు గుల్లవుతుంది. ఊహించని ప్రమాదాలతో చాలామంది గాయాలపాలు కూడా అవుతున్నారు. ఇవన్నీ డబ్బులు పోసి కొని తెచ్చుకుంటున్న కష్టాలే కదా. రానున్న రోజుల్లో ప్రభుత్వాలు బాణాసంచాకి కూడా రేషన్ పెడితే ఈ దండగ ఖర్చు తగ్గుతుందేమో...!

– యస్.రంగారెడ్డి, గూడూరు.




# ప్రశాంతిరెడ్డికి సముచిత గౌరవం!

శ్రీవారి సేవకోసం వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి గారి సతీమణి ప్రశాంతిరెడ్డికి తిరుమల పాలకమండలిలో మరోసారి అవకాశం కల్పించడం అభినందనీయం. అటు రాజకీయ రంగంలో, ఇటు ఆధ్యాత్మిక రంగంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న పుణ్యమూర్తులు వేమిరెడ్డి దంపతులు. సాక్షాత్తూ ఆ ఏడు కొండల స్వామివారినే నెల్లూరుకు తీసుకొచ్చి అత్యంత ప్రతిష్టాత్మకంగా వైభవోత్సవాలని నిర్వహించిన ఘనత వారిది. శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలలో సైతం సమాజ హితం కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి అనేక మహత్కార్యాలకి వేమిరెడ్డి కుటుంబం సారథ్యం వహించింది. ప్రశాంతిరెడ్డికి సముచిత స్థానం కల్పించి గౌరవించిన చంద్రబాబునాయుడు గారికి ధన్యవాదాలు. ప్రశాంతిరెడ్డికి నా అభినందనలు.

ఆర్.వీ.ఎస్.రెడ్డి, విశ్రాంత లెక్చరర్, నెల్లూరు.




# ఆంధ్రాకి.. 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' కావాలి!

అయిదు నెలలు... అంటే 150 రోజులు. కూటమి నేతృత్వంలో, చంద్రబాబునాయుడి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి అయిదు నెలలు. ఒకసారి ఎన్నికల తంతు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువైతే.. ఆ ప్రభుత్వానికే అయిదేళ్ళు సమయం ఉంటుంది.

అంటే 60 నెలలు, 260 వారాలు, 1825 రోజులు. ఆ అయిదేళ్ల కాలంలో అధికారంలోకి వచ్చిన పార్టీ తమ సత్తా చూపించాలి. దేశాన్ని లేదా రాష్ట్రాన్ని పురోగతి వైపు పరుగులు పెట్టించాలి. తమ పనితనంతో ప్రజలని మెప్పించాలి.

రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడైనా ఓ నలుగురు కలిస్తే... ఆంధ్రాలో కొత్త ప్రభుత్వం ఎలా ఉంది? అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటిపోయాయి కదా ఏదైనా మార్పు కనిపిస్తుందా? చంద్రబాబు పాలన బాగుందా? జగనే మేలనిపిస్తోందా? లాంటి ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కొత్త ప్రభుత్వం వచ్చి అయిదు నెలలే అయ్యింది. 20 వారాలే గడిచాయి. 150 రోజులే ముగిశాయి. అంతలోనే ఏం జరిగిపోవాలని మేధావులు కోరుకుంటున్నారు..? ఏం జరగాలని బాబుకి ఓటేసిన వాళ్ళు ఆశిస్తున్నారు..? కేవలం 150 రోజుల్లో అద్భుతాలని సాధించడం ఎంతటి మేధావికైనా, ఎంతటి అనుభవజ్ఞుడికైనా సాధ్యమయ్యేపనేనా..?

అపార రాజకీయ పరిజ్ఞానం ఉన్న మేధావులు, సుదీర్ఘ వ్యాపార అనుభవం కలిగిన పారిశ్రామిక ప్రముఖులు, సమాజాన్ని కాసి వడపోసిన విజ్ఞానవంతులైన విద్యావేత్తలు ఆలోచించాల్సిన విషయం ఇది.

## రాజకీయ నేతల స్వార్థానికి బలైపోయిన ఆంధ్రప్రదేశ్!

కొన్ని విచిత్రమైన పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ రాజకీయ నేతల స్వార్థానికి బలైపోయింది. పచ్చగా కళకళలాడుతుండిన ఉమ్మడి రాష్ట్రం రెండు ముక్కలుగా చీలిపోయింది. తనకి మంత్రి పదవి రాలేదన్న కోపంతో కేసీఆర్ చేపట్టిన తెలంగాణ ఉద్యమం రాష్ట్ర విభజనకి ఊతం ఇచ్చింది. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం మరణశయ్యపై ఉండిన కేసీఆర్ ఉద్యమానికి ఊపిరిపోసింది. జగన్మోహన్రెడ్డిపై కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పెంచుకున్న కక్ష, రాష్ట్రం రెండు ముక్కలు కావడానికి కారణమయ్యింది. ఎవరు అవునన్నా కాదన్నా ఇదే నిజం..!

## విభజన తరువాత అనాధగా మారిన ఆంధ్ర!

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రా అనాధాంధ్రగా అవతరించింది. తలలేని మొండెంలా దీనంగా మారింది. ఆ తరుణంలో జరిగిన ఎన్నికలలో ఆంధ్ర ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించారు. అంధకారంలో ఉన్న రాష్ట్రంలో అనుభవాన్ని అందలం ఎక్కించారు. తన నాన్న మరణాన్ని అస్త్రంగా మార్చుకుని, సానుభూతితో ఓట్లు తెచ్చుకుని, విభజిత ఆంధ్రాకి తొలి ముఖ్యమంత్రి కావాలనుకున్న జగన్ కోరికని సైతం జనం తిప్పికొట్టారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాన్ని కేవలం అయిదేళ్లలో గాడిన పెట్టాలంటే అసాధ్యం, అనితర సాధ్యం. ఆంధ్రాలో అదే జరిగింది.

## చాలని సమయం... అంతా అయోమయం...!

కొత్త రాష్ట్రానికి రాజధాని లేదు. హైకోర్టు లేదు. ఘనంగా చెప్పుకోవడానికి కనీసం కేంద్రప్రభుత్వ అధీనంలో నడిచే ఒక్క ప్రతిష్టాత్మక జాతీయస్థాయి సంస్థ కూడా లేదు. అంతర్జాతీయస్థాయి ఐటీ సంస్థలని ఆకట్టుకోవడానికి హైదరాబాదు లాంటి నగరం లేదు, అంతర్జాతీయ ప్రమాణాలున్న విమానాశ్రయమూ లేదు. కనీస వసతులు కూడా లేని కొత్త రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ వ్యవస్థని ఏర్పాటు చేయడమంటే ఆషామాషీ కాదు. హైదరాబాదు తరహాలో రాజధానిని ఏర్పాటుచేయాలంటే కనీసం పాతికేళ్ళు పడుతుంది. అలాంటి తరుణంలో 2014లో కొత్త రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార పీఠంలో కూర్చున్నారు. అంతా అయోమయం. కొత్త రాజధాని ఏర్పాటు కోసం తప్పటడుగులు వేస్తున్న క్రమంలో తప్పులు జరిగి తప్పటడుగులు పడ్డాయి. శాశ్వత నిర్మాణాల వేగం తగ్గింది. తాత్కాలిక సదుపాయాల ఏర్పాటు ప్రక్రియ వేగం పెరిగింది. ఫలితంగా ప్రజలు ఆశించిన మేరకు చంద్రబాబు పనిచేయలేకపోయారన్న అపఖ్యాతి టీడీపీకి మిగిలింది. సమయం సరిపోలేదు. కొత్తవి వెతుక్కునేలోపలే అయిదేళ్ళు గడిచిపోయాయి. 2019 ఎన్నికలు రానే వచ్చాయి. గడచిన ఐదేళ్లలో చంద్రబాబు చేసిందేమీ లేదని జగన్ చేసిన ప్రచారం వైసీపీకి కలిసొచ్చింది.

ఆ ఎన్నికలలో 151సీట్లతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇక్కడే ఆంధ్రాకి మళ్ళీ నష్టం జరిగింది. తమ అయిదేళ్ల పాలనలో వైసీపీ కూడా ఒక్కటంటే ఒక్క వ్యవస్థని కూడా శాశ్వత ప్రాతిపదికన పటిష్ట పరచలేకపోయింది. మూడు రాజధానులంటూ అసలు రాజధానినే అటకెక్కించింది. ఉచితాల పేరుతో ఉన్నదంతా ఊడ్చేసింది. సచివాలయ పాలనని పడకేయించింది. క్యాంపు కార్యాలయ పరిపాలనకి తెరలేపింది. రాష్ట్ర అధికార యంత్రాంగం మొత్తం తాడేపల్లి చుట్టూ తిరిగింది. మద్యం, మైనింగ్, ఇసుక వంటి వ్యాపారాలన్నీ ప్రభుత్వపెద్దల చేతులలోకి వెళ్లిపోయాయి. మైనింగ్ మాఫియా చక్రం తిప్పింది. గతంలో ఎన్నడూ ఎవ్వరూ కనీవినీ ఎరుగని రీతిలో సహజవనరుల దోపిడీ జరిగింది. అక్రమ కేసులు, బూతు పురాణాలు, బెదిరింపులు, మీసాలు తిప్పడాలు, తొడగొట్టడాలతో కాలం గడిచిపోయింది. ఆంధ్ర ప్రజలు అన్నీ గమనించారు. తడ నుండి ఇచ్ఛాపురం వరకు ఒకే తీర్పు ఇచ్చారు. బీజేపీ - టీడీపీ - జనసేన కూటమికే 164 సీట్లు ఇచ్చి అభివృద్ధికే తమ ఓటు అని తేల్చి చెప్పారు.

## ఆది నుండి మొదలు!

ఇంట్లో దోపిడీ దొంగలు పడి ఇల్లంతా చెల్లాచెదురైతే ఆ ఇంటిని సర్దుకోవాలంటేనే వారం నుండి పది రోజులు పడుతుంది. ప్రకృతి వైపరీత్యాలతో అల్లకల్లోలమైపోయే ఊళ్లని మళ్ళీ యథాస్థితికి తేవాలంటే కనీసం ఏడాది పడుతుంది. అలాంటిది గత అయిదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది, రాజకీయం పేరుతో అరాచకత్వం రాజ్యమేలింది. వ్యవస్థలన్నీ అస్థవ్యస్థమైపోయాయి. ఈ పరిస్థితులలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చింది. అనేక సంక్షోభాలు, అవరోధాలు చుట్టుముట్టి ఉన్నాయి. అవన్నీ ఒక్కొక్కటిగా అధిగమించాలి. ఆది నుండి మొదలుపెట్టాలి. ఓ వైపు సంపద సృష్టిస్తూ మరోవైపు అప్పులు తీర్చాలి. అందరూ ఊహిస్తున్నట్లుగా 2027లో జమిలి వస్తే... ఇక మిగిలింది రెండున్నర సంవత్సరాలే. చంద్రబాబు లౌక్యం చూపాలి. చాకచక్యంగా వ్యవహరించి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టుకోవాలి. ఇప్పుడు గ్రామాలలో పల్లె పండుగ తెచ్చినట్టే భవిష్యత్తులో ఇంటింటికీ పండుగ తేవాలి. ఇవన్నీ జరగాలంటే ప్రజలకి ఓర్పు ఉండాలి, లేదంటే ఆంధ్ర రాష్ట్రానికి "అల్లావుద్దీన్ అద్భుత దీపం" కావాలి!

- రాజశ్రీ

Sangeetha.com
PIONEER THEN. LEADER NOW.

## గ్రామ్‌ఫోన్ టు సెల్‌ఫోన్

50 Years



# యాభైఏళ్ళుగా సాగుతున్న 'సంగీత' సంరంభం



## అలుపెరుగని ప్రస్థానం.. జనం మనసుల్లో సుస్థిర స్థానం

**దక్షిణ భారతదేశంలో 'సంగీత' పేరు వినని వారు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలలో 'సంగీత'తో సాంగత్యం లేని ఇల్లు ఉండదంటే నమ్మక తప్పదు. ఆయా రాష్ట్రాలతో పాటు గోవా, గుజరాత్‌లలో కూడా తన శబ్దతరంగాలని విస్తరింపచేసింది 'సంగీత'. అంచెలంచలుగా ఎదుగుతూ భారతదేశమంతా సంగీతాభిమానులని సాధించుకోవాలనే లక్ష్యంతో తపిస్తున్న మన నెల్లూరు 'సంగీత' విజయప్రస్థానం ఈ వారం 'లాయర్' పాఠకుల కోసం.**

### వ్యవసాయం నుండి వ్యాపారం వైపు!


నెల్లూరుజిల్లా పొదలకూరు మండలంలోని తాటిపర్తి గ్రామం రైతు కుటుంబంలో పుట్టిన లక్కు పెంచలనారాయణరెడ్డి మానసపుత్రిక 'సంగీత'. నారాయణరెడ్డి చదువైపోయిన తొలి నాళ్ళలో తండ్రికి తోడుగా తాటిపర్తిలో నాగలి పట్టారు. నాగలితో అందరి ఆకలి తీరదని గ్రహించారు. తాను చదివిన చదువుకి సార్ధకత చేకూరదని భావించారు. వెంటనే మదరాసుకి పయనమై అక్కడ నెల్లూరీయుల సంస్థ విజయ హోమ్ అప్లయన్సెస్‌లో ఉద్యోగిగా చేరారు. అక్కడ కొంతకాలం పనిచేసిన తరువాత బదిలీపై బెంగళూరుకి వెళ్లారు. తన పేరులోనే లక్కు (అదృష్టం) ఉంది, మరి ఎంతకాలం ఇలా ఉద్యోగం చేయాలి..? మన అదృష్టాన్ని (లక్కు) ఎందుకు పరీక్షించుకోకూడదు..? అన్న ఆలోచన ఆయన జీవితాన్నే మార్చేసింది. నారాయణరెడ్డి తన ఆలోచనని తన సహచర మిత్రుడు పెళ్లకూరు వెంకటసుబ్బారెడ్డి, బంధువులు బాలిరెడ్డి నాగిరెడ్డి, ఎల్.పి.కృష్ణారెడ్డిల ముందుంచారు. వాళ్ళు కూడా సుముఖత చూపించడంతో 1974, మే 31వ తేదీన 'సంగీత'కి బెంగళూరులో ప్రాణం పోశారు. తాను ఉద్యోగిగా పనిచేసిన సంస్థ ఛైర్మెన్ దొడ్ల పార్ధసారధిరెడ్డి చేతుల మీదుగానే 'సంగీత' ప్రయాణాన్ని ప్రారంభింపచేశారు. గ్రామ్‌ఫోన్ – గ్రామ్‌ఫోన్ రికార్డులు వీనులవిందుగా సంగీతాన్ని అందిస్తాయి కాబట్టి తన సంస్థకి ఆయన 'సంగీత'గా నామకరణం చేసుకున్నారు.

ఏ వ్యాపారమైనా ఆరంభ అరిష్టాలు, పురిటి కష్టాలు తప్పవు. 'సంగీత'కి కూడా అలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురయ్యాయి. నారాయణరెడ్డి భాగస్తులు సంస్థ నుండి వైదొలిగారు. నారాయణరెడ్డి మాత్రం 'సంగీత' చేయి విడిచిపెట్టలేదు. అధైర్యపడలేదు. 'సంగీత' సామ్రాజ్యంలోనే తన ప్రస్థానాన్ని కొనసాగించారు. 'సంగీత'ని ప్రారంభించిన అదే పార్ధసారథిరెడ్డి ఇచ్చిన హార్ధిక, ఆర్ధిక బలంతో 'సంగీత'ని నిలబెట్టారు.

### 'సంగీత' స్వరూపాన్ని మార్చేసిన వారసుడి ఆరంగేట్రం!

నారాయణరెడ్డి వారసుడు సుభాష్‌చంద్ర 1982లో 'సంగీత' పగ్గాలు చేపట్టారు. నారాయణరెడ్డి ఆశయాలకు, ఆకాంక్షలకి వారసుడిగా 'సంగీత'ని ముందుకు తీసుకెళ్లారు. కాలానుగుణంగా సమాజానికి అవసరమైన కంప్యూటర్లు, టీవీలు, ఆడియో ప్లేయర్లు వంటి ఎలక్ట్రానిక్ గృహోపకరణాలవైపు 'సంగీత'ని దారి మరల్చారు.

అదే క్రమంలో సమాచార సాంకేతిక విప్లవం మొదలయ్యింది. ల్యాండ్‌లైన్ ఫోన్ల స్థానాన్ని సెల్‌ఫోన్‌లు ఆక్రమించడం ప్రారంభమయ్యింది. ఆ తరుణాన్ని సుభాష్‌రెడ్డి తనకి అనుకూలంగా మరల్చుకున్నారు. సెల్‌ఫోన్ ప్రభంజనాన్ని 'సంగీత'కి అవకాశంగా మార్చుకున్నారు. ఆ ఒక్క నిర్ణయం 'సంగీత' దశ దిశని మార్చేసింది. నోకియా, శ్యామ్‌సంగ్, సిమెన్స్, మోటోరోలా, యాపిల్.. ఇలా అదీ ఇదీ అని కాకుండా అన్ని బ్రాండ్ల విక్రయంలో దేశంలోనే నెం.1గా 'సంగీత' సెల్‌ఫోన్ వినియోగదారుల మనసులలో సుస్థిరస్థానం సంపాదించింది. ఇప్పుడు 7 రాష్ట్రాలలో 800 ఔట్లెట్లతో, 5,500మంది ఉద్యోగులతో, 6 కోట్లమంది వినియోగదారులతో సంగీత కుటుంబం విస్తరించింది. నారాయణరెడ్డి కుమార్తె సుభాష్‌చంద్ర చెల్లెలు భువనేశ్వరి కూడా 'సంగీత' కుటుంబంలో భాగస్వామిగా వ్యవహరించడం విశేషం.



'సంగీత' కుటుంబం : సంగీత వ్యవస్థాపకులు నారాయణరెడ్డి, కుమారుడు సుభాష్‌చంద్ర, కోడలు భారతి (ఎడమ), కుమార్తె భువనేశ్వరి, మనుమడు చందురెడ్డి, మనుమడి భార్య రమ్య మరియు నారాయణరెడ్డి మనుమరాలు గగన (భువనేశ్వరి కుమార్తె)

### వినూత్న సేవలు!

మనం బహిరంగ మార్కెట్లో కొనే ధరలకన్నా తక్కువకే 'సంగీత'లో అన్నీ బ్రాండ్ల సెల్‌ఫోన్‌లు లభిస్తాయి. మనం కొనే సెల్‌ఫోన్‌కి అష్యూరెన్స్ సౌకర్యం కూడా ప్రప్రథమంగా 'సంగీత' పరిచయం చేసింది. ఫోను పగిలిపోయినా, నీళ్ళల్లో పడినా, కాలిపోయినా కేవలం 30శాతం చెల్లింపుతో కొత్త ఫోను ఇస్తోంది 'సంగీత'. అంతే కాకుండా మనం 'సంగీత' వద్ద కొన్న ఫోను పోగొట్టుకుంటే.. ఎలాంటి ఎఫ్.ఐ.ఆర్ లేకుండానే కొత్త ఫోను అందిస్తుంది. వినియోగదారుడికి మరో సాహసోపేతమైన సౌలభ్యానికి కూడా 'సంగీత' శ్రీకారం చుట్టింది. తమ వద్ద కొన్న ఏ కంపెనీ ఫోనుకైనా కొన్ని అనూహ్య పరిస్థితులలో ఆ సంస్థ తయారీదారులు ధర తగ్గిస్తే (అలా తరచూ అనేక సంస్థలు ఫోను ధరలని తగ్గిస్తుంటాయి) ఆ ధర తగ్గించిన 30 రోజుల లోపు సంగీత ఖాతాదారుడు 'సంగీత'ని సంప్రదిస్తే సదరు సంస్థ ఎంత తగ్గించిందో అంత మొత్తాన్నీ సంగీత తిరిగిచ్చేస్తుంది. అలా ఇప్పటివరకూ సుమారు 33 కోట్ల రూపాయలని 'సంగీత' తమ ఖాతాదారులకు తిరిగి ఇచ్చేసింది. ఇప్పటికీ ఇస్తూనే వుంది. మొత్తం వీటన్నిటికీ కొన్ని షరతులు వర్తిస్తాయి.

### ఆన్‌లైన్ సేవలలో అగ్రగామిగా!

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన అరగంట (30 నిమిషాలు)లో మనం కోరుకున్న మోడల్ సెల్‌ఫోన్‌ని మన ఇంటికి డెలివరీ చేసే ఏకైక సంస్థ 'సంగీత'. ఇప్పటికే దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ సేవలని భారతదేశమంతా విస్తరింపచేయాలన్న దిశగా సంస్థ అడుగులు వేస్తోంది. తమ సంస్థ అవుట్‌లెట్‌లు లేని ప్రాంతంలో కూడా ఆన్‌లైన్ సేవలని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది.

### సేవారంగంలో మేము సైతం అంటూ!

నారాయణరెడ్డి 29 ఏళ్ళ ప్రాయంలో ఉండగానే ఆయన సతీమణి హనుమాయమ్మ ఆయనకి దూరమై అనంతలోకాలకేగారు. ఆమె గుర్తుగా 'హనూ సేవాసమితి'ని నారాయణరెడ్డి స్థాపించారు. తన స్వగ్రామం తాటిపర్తిలో ఆమె జ్ఞాపకార్ధం ఒక వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి నడుపుతున్నారు. ఆ ఆశ్రమ ఆలనా పాలనా నారాయణరెడ్డి అల్లుడు (భువనేశ్వరి భర్త) పలుకూరు భాస్కరరెడ్డి చూసుకుంటారు. ఆయన తన పూర్తి సమయాన్ని వృద్ధుల సేవకే అంకితం చేయడం గమనార్హం.

కరోనా కష్టకాలంలో 'సంగీత' తనవంతుగా 10 లక్షలమందికి అన్నప్రసాదం అందచేసింది. జొమాటో ఫీడింగ్ ఇండియా సౌజన్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది.

'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న మాటకి అక్షర సత్యంగా 'సంగీత' ఎదిగింది. ప్రారంభదశలో ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడింది. నారాయణరెడ్డి భాగస్తులు 'సంగీత'ని వదిలేసినా, ఆయన మాత్రం ఆత్మస్థైర్యాన్ని వదిలిపెట్టకుండా ముందుకు నడిపించిన 'సంగీత' ఇప్పుడు భారతదేశం మొత్తం సంగీత సౌరభాలని వెదజల్లడానికి సన్నాహమవుతోంది. మే31, 2024న 50 సంవత్సరాలని పూర్తి చేసుకుని 'స్వర్ణోత్సవం' జరుపుకుని రెట్టింపు సమరోత్సాహంతో వినియోగదారుల సేవలో దూసుకుపోతోంది. ఈ ఆనందోత్సవ తరుణంలో 'సంగీత'కి 'లాయర్' అభినందనలు!




# 15న కన్నులపండువగా..'కార్తీక దీపోత్సవం'



- కాశీ ఘాట్‌ను తలపించేలా గణేష్ ఘాట్
- వేలాదిమంది మహిళలతో శోభాయాత్ర

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కార్తీకమాసం సందర్భంగా ఈనెల 15న నెల్లూరు చెరువు గట్టున ఉన్న గణేష్‌ఘాట్‌లో అత్యంత వైభవంగా కార్తీక దీపోత్సవం నిర్వహిం చేందుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 5న ఆ ఏర్పాట్లను అధికారులతో కలిసి శ్రీధర్‌రెడ్డి సమీక్షించారు. సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమం కన్నులపండువగా జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ పవిత్ర కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడిగా అన్నివేళలా తాను అండగా ఉంటానన్నారు. కాశీ ఘాట్‌ను తలపించేలా గణేష్ ఘాట్‌ను తీర్చిదిద్దుతామని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కార్తీక దీపాలు చేతపట్టుకొని వేలాదిమంది మహిళలతో శోభాయాత్ర జరుగుతుందని, 6 గంటలకు గంగాహారతి, అనంతరం 108 తెప్పలతో శివాకృతి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని కూడా భారీస్థాయిలో కనీవినీ ఎరుగని విధంగా వినూత్నంగా నిర్వహిస్తా మని ఆయన తెలిపారు నగర కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షులు కొండూరు జయప్రద, నిర్వాహకులు విజయ్‌కుమార్, రాజేష్, ముక్కాల వ్యాసప్రసాద్, కొండూరు జయరాం, బాలు సుబ్బారావు, శ్రీకాంత్, తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్ పాలూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# అమరజీవి సేవలు అజరామరం



- కొనియాడిన జనసేన

ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన సేవలు చిరస్మరణీయమని జనసేన నాయకులు కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబరు 1న పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరా ములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 56 రోజులపాటు ఆమరణ దీక్ష చేసి ఆత్మబలిదానం గావించిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములని, యువత ఆయన ఆదర్శాల బాటలో నడవాలని అన్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్‌బాబు, జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, నగర నాయకులు లాలూ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు క్రిస్మస్ వేడుకలు..21న

ఈనెల 21న ముందస్తు క్రిస్మస్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రెవరెండ్ డి.వినోద్‌ప్రకాష్ చెప్పారు. ఈనెల 5న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరంలోని విఆర్ కళాశాల మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 3 వందలమంది పాస్టర్ల సమక్షంలో వందలాదిమందితో కలిసి ఈ వేడుకలను నిర్వహిస్తామని చెప్పారు. కన్వీనర్ దామ వరపు నవీన్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.






పల్లెల ప్రగతికి

# ప్రణాళికలు రూపొందించండి

జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ




జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూ అధికారులు ప్రణా ళికలు రూపొందించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కోరారు. 'గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీ' అనే అంశంపై రెండురోజుల పాటు జరిగే శిక్షణలో భాగంగా, ఈనెల 5న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధుల ఆధారంగా పల్లెల ప్రగతికి ప్రణాళికలు తయారు చేయాలని, అభివృద్ధి పనులు భావితరాలకు కూడా ఉపయోగపడేలా ఉండాలని చెప్పారు. జడ్పీ సీఈఓ మోహన్‌రావు అధ్యక్షతన ఈ కార్య క్రమం జరిగింది.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిం చేందుకు జిల్లా అధికారయంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆమేరకు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కూడా ఇస్తోంది. ఎన్నికల నిర్వహణకు సంబం ధించి, ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన సమావేశమందిరంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 490 నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులకు, 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షు లకు, 7 ప్రాజెక్టు కమిటీ ఛైర్మెన్‌లకు ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు నవంబర్ 20వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని, సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎన్నిక నవంబర్ 21 నుండి 23 వరకు మూడురోజులపాటు నిర్వహిస్తామని జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ తెలిపారు. జిల్లాలో ఈ ఎన్నికల నిర్వహణకు 980 మంది పోలింగ్ అధికారులను, 7,396 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు 37 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ పూజ, నెల్లూరు రెవిన్యూ డివిజన్ అధికారి అనూష, కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి వంశీకృష్ణ, నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలకు..కొత్త ప్రిన్సిపాల్

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళా శాలకు కొత్త ప్రిన్సిపాల్ నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సి పాల్‌గా ఉన్న డాక్టర్ ఎస్‌వీవీఎన్ రాజమన్నార్‌ను నెల్లూ రులో నియమిస్తూ ప్రభుత్వం ఈనెల5న ఉత్తర్వులిచ్చింది.

## అభ్యర్థులకు 14న ఇంటర్వ్యూలు

ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ శిక్షణ కళాశాలలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న ఐటిఐ అభ్యర్థులకు ఈనెల 14న కాకుటూరులో ఇంటర్వ్యూలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. అప్రెంటిస్‌షిప్‌కు సెప్టెంబరు 17న దరఖాస్తు చేసుకున్నవారికే ఈ ఇంటర్వ్యూలుంటాయని, అభ్యర్థులు అసలు, నకలు ధృవపత్రాలను తీసుకురావాలని తెలిపారు.

## నెల్లూరు కబుర్లు



తల్లితండ్రులు బిడ్డలకిచ్చే

# పెద్ద ఆస్తి..చదువే

మంత్రి నారాయణ

తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఇచ్చే పెద్ద ఆస్తి చదువేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 3న నెల్లూరులోని కాపు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో, ఉత్తమ మార్కులు సాధించిన పేద బలిజ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ విజయభాస్కర్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువే ఏకైక మార్గమని ఆయన అన్నారు. అదేవిధంగా గతంలో తాను మంత్రిగా పనిచేసిన కాలంలో కాపు భవన్ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా స్థలం మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేశా మని గుర్తుచేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 104 మంది విద్యార్థినీ విద్యార్థులకు 4 లక్షల 20 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందించడం గొప్ప విషయమన్నారు. అందుకు సహకరించిన డాక్టర్ పోకల రవిని ఆయన అభినందించారు. జనసేన నాయకులు గునుకుల కిషోర్, అళహరి సుధాకర్, బలిజ సామాజికవర్గ నాయకులు అనిల్ కుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి



నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 5న నెల్లూరు నగరంలోని అనేక నాగుల పుట్టల వద్ద, నాగుల శిలల వద్ద, నాగేశ్వరా లయాలు, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మూలాపేట లోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానం వద్దనున్న నాగులపుట్ట దగ్గరకి పెద్దసంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి పిండిదీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. శెట్టిగుంటరోడ్డులోని నాగేంద్రనగర్, బాలాజీనగర్ పుట్టవీధి లోని నాగేంద్రస్వామి పుట్ట, రాయాజీవీధిలోని వెన్నెలకంటివారి పుట్ట, మూలాపేట శివాలయం, పొర్లుకట్ట వద్దనున్న నాగళ్ళ పరమేశ్వరి దేవ స్థానం, నిప్పోసెంటర్‌లోని నాగేంద్రస్వామి దేవస్థానం..ఇలా పలుచోట్ల నాగులపుట్టలకు పూజలు జరిగాయి.

# 'వెల్ వాకర్స్ వింగ్' ప్రారంభం



నెల్లూరులో 'వెల్ వాకర్స్ వింగ్' పేరుతో వాకర్స్ క్లబ్ ప్రారంభమైంది. పొదలకూరురోడ్డులోని హైస్కూల్లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ 203 వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ గవర్నర్ పలగాటి శ్రీనివాసరెడ్డి దీనికి ప్రారంభోత్సవం చేశారు. వాకర్స్ డెప్యూటీ గవర్నర్ రఘురాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. 'వాకర్స్ వింగ్' అధ్యక్షులుగా బొగ్గవరపు శ్రీమ న్నారాయణ, కార్యదర్శిగా పేటేటి వెంకటయ్య, కోశాధికారిగా లక్కాకుల పెంచలనర్సింహారావు, గౌరవ సలహాదారుగా డా.గంగిశెట్టి శివకుమార్, కార్యనిర్వహణ సభ్యులుగా ఉదయ్‌నారాయణ, అర్జున్, వెంకటేశ్వర్లు, మహిళా ప్రతినిధిగా శిఖరం రాజేశ్వరి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

# చెంగాళమ్మ తల్లికి.. విపిఆర్ దంపతుల ప్రత్యేక పూజలు



దీపావళి పర్వదినం, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియామకం.. సందర్భాలను పురస్కరించుకుని, వేమిరెడ్డి దంపతులు ఇటీవల సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు ఈ సందర్భంగా ఘనస్వాగతం పలికారు. చెంగాళమ్మ అమ్మవారికి పూలు పండ్లు సమర్పించి పూజలు చేసిన అనంతరం, వేమిరెడ్డి దంపతులు వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చెంగాళమ్మ అమ్మ వారికి మూడువందల టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డెప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సూళ్లూరు పేట టీడీపీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, నెలవల పార్ధసారధి, తిరుపతి జిల్లా టీడీపీ కార్యదర్శి కె.జి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి 12 లక్షల విరాళం

తెలుగు-తమిళ ప్రజల ఆరాధ్యదైవం, కరుణామయి..సూళ్ళూరుపేటలో కొలువైవున్న శ్రీ చెంగాళ పరమేశ్వరి దేవాలయానికి ఆధ్యాత్మిక సామాజిక సేవాపరాయణులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు శాసనపసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు 12 లక్షల రూపాయల విరాళం అందించి తమ దైవభక్తిని చాటుకున్నారు. ఆలయాభివృద్ధికి అందులో 7 లక్షల రూపాయలు కేటాయించారు. మిగిలిన 5 లక్షల రూపాయలను ఆలయ ప్రాంగణంలో జరిగే నిత్యాన్న దానానికి వెచ్చించాలని సూచించారు. ఆమేరకు వేమిరెడ్డి దంపతులు విరాళం చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారిణి ప్రసన్నలక్ష్మికి అందజేశారు.

# ప్రశాంతమ్మకు అభినందనల వెల్లువ

## విపిఆర్ నివాసం వద్ద సందడే సందడి

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యురాలిగా నియామకమైన నేపథ్యంలో నెల్లూరులోని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నివాసానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆమెకు పూలబొకేలతో, పూలమాలలతో శుభాకాంక్షలు చెప్పారు. దీంతో, నెల్లూరు మాగుంట లే-అవుట్‌లోని విపిఆర్ నివాసం ప్రాంతమంతా సందడిగా





మారింది. తిరుమలేశుని భక్తురాలైన ప్రశాంతిరెడ్డి మూడవసారి టీటీడీ బోర్డు సభ్యురాలిగా ఎంపికవడం పట్ల తెలుగుదేశం కార్యకర్తల్లో సంతోషం వెల్లివిరిసింది. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు.

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు.. రాష్ట వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ షేక్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నుడా మాజీ ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, జనసేన నాయకులు నూనె మల్లికార్జున్ యాదవ్, కారంపూడి కృష్ణారెడ్డి, గునుకుల కిషోర్ తదితరులు శాలువాలు, పూల బొకేలతో ప్రశాంతమ్మను సత్కరించి శుభాభినందనలు తెలియ చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇందుకూరుపేట, కోవూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు చెందిన పలువురు నాయకులు ఆనందోత్సాహంతో స్వీట్లు పంచి, విపిఆర్ నివాసం వద్ద బాణాసంచా వేడుకలతో సంబరాలు చేసుకున్నారు.

# ఎన్‌బికెఆర్‌లో.. ఫ్యాకల్టీ శిక్షణా తరగతులు



కోట మండలం ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి సౌజన్యంతో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో (ఏటిఏఎల్) అధ్యాపక శిక్షణ తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. 'అప్లికేషన్స్ ఆఫ్ ఫైనేట్ ఎలిమెంట్ అనాలసిస్ ఇన్ ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్' అనే అంశంపై ఈ శిక్షణా తరగతులను ప్రారంభించినట్టు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ శిక్షణా తరగతులను ఆరు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా ఐఐటి తిరుపతి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ఎం రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '3డి ప్రింటింగ్ తయారీ యుగం భవిష్యత్తుగా మారబోతోందన్నారు. ఐఐటి మద్రాస్ ఆచార్యులు డాక్టర్ శివ శ్రీనివాస్ దేవాదుల, విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ ఆర్ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.



# సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం

భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, ఐక్యభారత నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి ఛైర్మెన్‌గా నియమితులైన సందర్భంగా భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఇటీవల గౌరవపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు అందుకున్న బి.ఆర్.నాయుడు

## సంక్రాంతి కల్లా..

# అన్ని రోడ్లూ కళకళలాడాలి

➢ అధికారులను ఆదేశించిన మంత్రి ఆనం



'సంక్రాంతి నాటికి అన్ని రోడ్లూ కళకళలాడాలి.. ఏ రోడ్డుమీదా గుంతలు ఉండకూడదు..'.. అంటూ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంబంధిత అధికారులని ఆదేశించారు. గత ప్రభుత్వం రోడ్ల బాగోగులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. చేజర్ల మండలం మాముదూరు గ్రామంలో ఆయన ఇటీవల గుంతలమయమైన రోడ్డుపై కంకర చిప్స్ వేసి గుంతలను పూడ్చే పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ ఒక్క రోడ్డుపై కూడా గుంతలు లేకుండా ప్రజలందరూ సాఫీగా ప్రయాణం చేసేవిధంగా చూడాలని, 'గుంతల రహిత ఆంధ్రప్రదేశ్' లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రూ. 3.47 కోట్లతో 15 ఆర్ అండ్ బి రోడ్డు పనులను మొదలుపెట్టినట్లు మంత్రి వివరించారు. వచ్చే మార్చి నెలాఖరులోగా ఈ నియోజకవర్గంలో రూ. 70కోట్లతో రహదారుల మరమ్మత్తు పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. తన హయాంలో గతంలో గొల్లపల్లి దగ్గర ఆగిన రోడ్డు నిర్మాణాన్ని తిరిగి తానే మొదలు పెడతానని చెప్పారు. సంగం బ్యారేజ్ వరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తొలుత మాముదూరు గిరిజన కాలనీలో సిమెంట్ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్థానిక నాయకులు ఏర్పాటుచేసిన రోడ్‌షోలో పాల్గొన్నారు. అక్కడి గిరిజన కాలనీకి రామాలయాన్ని మంజూరు చేయాలని స్థానిక మహిళలు విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించిన మంత్రి, రామాలయాన్ని మంజూరుచేసి, నిర్మాణ పనులను సంక్రాంతి నుంచి మొదలుపెట్టేలా కృషి చేస్తామని చెప్పారు. ఆర్అండ్‌బీ ఎస్ఇ గంగాధర్, ఆత్మకూరు ఆర్డీఓ పావని, స్థానిక నాయకుడు బొల్లినేని గిరినాయుడు పాల్గొన్నారు.






## ముఖ్యమంత్రికి..వేమిరెడ్డి దంపతుల ధన్యవాదాలు

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దేవదేవుడికి సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా శ్రీవారి భక్తులకు సేవ చేస్తామని వారు తెలిపారు.

# వైకాపాకి పూర్వ వైభవం తేవాలి

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వైకాపాకి మళ్ళీ పూర్వవైభవం తీసుకురావాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 5న వెంకటగిరిలోని నేదురుమల్లి బంగ్లాలో వెంకటగిరి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులతో భేటీ అయ్యారు. తెలుగుదేశం పార్టీ వారి నుంచి స్థానికంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆయన తెలుసుకున్నారు. పార్టీని నిలబెట్టుకునేందుకు ఏం చేయాలో నాయకులతో కలిసి చర్చించారు.

# లివర్ క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

## • ప్రముఖ లివర్ ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ వెల్లడి



***లివర్ (కాలేయం) క్యాన్సర్ చాలా ప్రమాదకరమని, లివర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లివర్‌ప్లాంటేషన్‌లో సీనియర్ శస్త్ర చికిత్స నిపుణులు, చెన్నైలోని గ్లెనిగల్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రజనీకాంత్ చెప్పారు. ఈ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే.. దాన్ని పూర్తిస్థాయిలో నివారించుకునేందుకు కూడా వీలుంటుందని ఆయన తెలిపారు.***

ప్రముఖ లివర్ వ్యాధి నివారణ నిపుణునిగా డాక్టర్ రజనీకాంత్ ప్రసిద్ధి. ప్రతినెలా మొదటి గురువారం రోజున ఆయన నెల్లూరుకు వచ్చి లివర్ వ్యాధిగ్రస్తులను పరిశీలించి తగు సూచనలిస్తున్న విషయం తెలిసిందే. అవసరమైన శస్త్రచికిత్సలను చెన్నై లోని ఆసుపత్రిలో నిర్వహిస్తుంటారు కూడా. ప్రపంచ లివర్ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా ఆయన ఇటీవల లివర్ క్యాన్సర్‌పై అవగాహన కలిగిస్తూ, నెల్లూరులో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తులకు ప్రాణాంతకంగా తయారవుతున్న లివర్‌వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణల విషయాలను ఆయన వెల్లడించారు.

### ఇది సైలంట్ డిసీజ్ :

లివర్ క్యాన్సర్ అనేది సైలెంట్ వ్యాధి అని, లివర్ పూర్తిగా దెబ్బతింటే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, అందువల్ల లివర్ సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. సహజంగా చాలామంది చివరి దశ వరకు దీనిని గుర్తించకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. సరిగా ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం, పొట్టనొప్పి, కొంతమందికి కామెర్లు ఉండడం వగైరాలు ఆ వ్యాధి లక్షణాలుగా ఉంటాయని, అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేసుకోవడం ద్వారా ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించవచ్చని ఆయన తెలిపారు.

### వ్యాధికి కారణాలు :

మద్యపానం చేసేవారు, హెపటైటిస్ వైరస్ ఉన్నవారు తరచుగా రక్తపరీక్షలు, ముఖ్యంగా లివర్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవడం అవసరమని ఆయనన్నారు. ఈ వ్యాధి వచ్చేందుకు కొన్ని జన్యుపరమైన కారణాలు కూడా ఉంటాయన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలం నిల్వ ఉంచిన ఊరగాయలు, బూజుపట్టిన పచ్చళ్ళు, వేరుశనగ కాయలు వంటివాటిలో ఉండే 'ఆఫ్లో టాక్సిన్' అనే ఫంగస్ ద్వారా కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశముందన్నారు.

### అందుబాటులో చికిత్సలు :

లివర్ వ్యాధి నివారణకి అందుబాటులో మంచి చికిత్సలున్నాయని, లివర్ కీమో థెరపీ, ఇమ్యునోథెరపీ, లివర్ రేడియేషన్ మార్గాల ద్వారా దీనిని తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. దీనిని తొలిదశలో గుర్తిస్తే లివర్ మార్పిడి ద్వారా పూర్తిగా వ్యాధిని నివారించవచ్చని, ఇటీవల కూడా పలువురు లివర్ వ్యాధిగ్రస్తులకు లివర్ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా చేశామని, వారంతా ఆరోగ్యంగా ఉన్నారని ఆయన తెలిపారు.

# మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా..సుబ్బారావు



నెల్లూరులోని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా టీవీ సుబ్బారావు నియమితులయ్యారు. గతంలో ఆయన నగరంలోని నవాబుపేట ఇన్స్‌పెక్టర్‌గా పనిచేశారు. ఈనెల 6న ఆయన మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడంతో, స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆయన పోలీసు ఉన్నతాధికారులను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

# అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు

**ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్**




దీపం-2 పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తామని గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. కోట మండలం వెంకన్నపాళెం గ్రామంలో ఇటీవల ఆయన దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్‌సిలిండర్లు అందజేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల వారికి 24గంటలలో, గ్రామీణ ప్రాంతాలవారికి 48గంటల్లో లబ్దిదారుల ఖాతాల్లో డబ్బు జమవుతుందని తెలిపారు. నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన క్రీడాకారులు



గూడూరుకు చెందిన క్రీడాకారులు తమిళనాడు ఓపన్ షటిల్ బాడ్మింటన్ క్రీడా పోటీలలో సత్తా చాటారు. ఈ నెల 3వ తేదీ జరిగిన ఈ పోటీలలో అండర్ 15 విభాగంలో గూడూరు హెచ్డీ ఎరీనా స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు షాహిర్, అండర్ 9, అండర్ 11 విభాగాలలో యశ్విన్ ప్రథమ స్థానంలో నిలిచారు. నిర్వాహకుల నుండి పారితోషకం, షీల్డులు అందుకున్నారు. ఈ నెల 4న షటిల్ కోర్టులో ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు.

# నేర నియంత్రణకే కార్డన్‌సెర్చ్



గూడూరు పురపాలక పరిధిలోని అడవి కాలనీ వద్ద డీఎస్పీ రమణ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలను సీజ్ చేసి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం పట్టణ, గ్రామీణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. ఎస్సైలు మనోజ్‌కుమార్, సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, గూడూరు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాస్ కౌన్సిలింగ్ నిర్వహించారు.

# యువ వైద్యుడు.. డాక్టర్ మనోజ్ కన్నుమూత!



నెల్లూరుజిల్లా వాకాడు మండలం వాల్మేడు గ్రామానికి చెందిన యువ వైద్యుడు డాక్టర్ యరగాటిపల్లి మనోజ్ కుమార్‌రెడ్డి నవంబర్ 2వతేదీ శనివారం హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా డాక్టర్ మనోజ్ అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్నారు. నెల్లూరు నగరంలో విజయశ్రీ లాడ్జిని ఎరుగని పాతతరం నెల్లూరీయులు ఉండరు. విజయశ్రీ కృష్ణారెడ్డిగా మనోజ్ నాన్న కృష్ణారెడ్డిని తెలియని వారు కూడా ఉండరు. నెల్లూరులో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న అనంతరం తిరుపతిలో డాక్టర్ పట్టా పుచ్చుకున్నాడు మనోజ్. అనంతరం జనరల్ మెడిసిన్‌లో మాస్టర్స్ కోసం మంగళూరు వెళ్ళారు. దేగపూడి సుగుణాకరరెడ్డి – ఇందిరమ్మల మూడవ కుమార్తె శ్రీలతని కళ్యాణమాడారు. మాస్టర్స్ పూర్తైన అనంతరం తన శ్రీమతి పేరులోని తొలి అక్షరం 'శ్రీ' వచ్చేలా నెల్లూరులో 'శ్రీ క్లినిక్' ప్రారంభించారు. అనతికాలంలోనే మంచి హస్తవాసి వున్న డాక్టర్‌గా గుర్తింపు పొందారు. స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన, తాను కార్యదర్శిగా 'శ్రీ షిర్డీ సాయి రూరల్ వెల్ఫేర్ & మెడికల్ ఫౌండేషన్'ని స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల పేదవారికోసం ఆ ట్రస్టుని అంకితం చేశారు. అనేక మంది పేదవాళ్ళ ఇళ్ళలో వెలుగులు నింపారు. ఎంతోమంది చిన్నపిల్లలకి తమ ట్రస్టు ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించాడు. తన ఆప్తమిత్రుడు డాక్టర్ కంచర్ల రమేష్, దేగా వెంకట్‌ల పిలుపుమేరకు ఉన్నత చదువులకోసం నెల్లూరు నుండి ఇంగ్లాండుకి వెళ్లారు. అనివార్య కారణాలవల్ల అక్కడ ఎక్కువ కాలం ఉండలేకపోయారు. 2001లో భారతదేశానికి తిరిగివచ్చి మరికొంత మంది సహచర వైద్యులతో కలసి హైదరాబాదులో పసిఫిక్ మెడికల్ సెంటర్ పేరుతో హాస్పిటల్ ప్రారంభించి అక్కడే స్థిరపడ్డారు.

నెల్లూరు వదిలిన తరువాత మనోజ్‌కి కాలం కలసిరాలేదు. పరిస్థితులు అనుకూలించలేదు. హైదరాబాదులోనే వైద్యుడిగా ప్రాక్టీస్ చేస్తూ అనారోగ్యం పాలై చిన్న వయస్సులో కన్నుమూశారు. మనోజ్‌కి భార్య శ్రీలత, కుమారుడు అఖిల్ కృష్ణారెడ్డి ఉన్నారు. స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తిత్వం మనోజ్‌ది. ఆయన మిత్రులకి కూడా మనోజ్ అంటే పిచ్చి ప్రేమ, అభిమానం. తనని అమితంగా ఇష్టపడే స్నేహితులని, సన్నిహితులని, హితులని విడిచి సుదూరతీరాలకి వెళ్ళిపోయాడు మనోజ్. మనోజ్‌కి సేవాదృక్పథం ఎక్కువ. పేదలంటే చాలా మక్కువ. ఆ లక్షణాలే నెల్లూరులో ట్రస్టు పెట్టేలా మనోజ్‌ని ప్రేరేపించాయి. ఆ గుణాలే చాలామంది అమ్మానాన్నల కళ్ళలో ఆనందాన్ని నింపాయి. అలాంటి మనోజ్‌ని చిన్నవయస్సులోనే మృత్యువు కబళించింది. మనోజ్ కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ మనోజ్ ఆత్మకి సద్గతి చేకూరాలని ప్రార్థిస్తోంది 'లాయర్'.



# జానకిరామ.. రామాయణం

38

- ఊటుకూరు జానకి రామారావు



మహాఇల్లాలు సీతమ్మ మాత్రం ఏ పలుకూ లేక మౌనంగా ఉంది మహారాజా!

మన అయోధ్య అంతా కళావిహీనమై, కాంతిని కోల్పోయి ఆనందశూన్యమై ఎడారిని తలపిస్తోంది ప్రభూ.

సుమంత్రుడి మాటలు విని.. 'అయ్యో నేనెంత తెలివితక్కువ వాడను! ఒక స్త్రీ మాట విని ఎవరినీ సంప్రదించకుండా, వృద్ధులతో విచారించకుండా, మంత్రులతో సమాలోచనలు చేయకుండా, వర్తకులతో మాటైనా చెప్పకుండా ఏకపక్షంగా తొందరపాటుతో ఎంత పాడు పని చేశాను?'...

సుమంత్రా ఇప్పటికి కూడా నా ఆజ్ఞ చెల్లుబాటు అవుతున్నట్లయితే నన్ను వెంటనే నా రాముడి వద్దకు తీసుకొనిపో!

ఆజానుబాహుడు, అరవిందదళాయతాక్షుడు, మణికుండల భూషితుడూ, మూపున పెనువిల్లు ధరించి మనోహరంగా కనపడే నా రాముడు నా ఎదుట లేకపోతే నాకీ బ్రతుకు ఎందుకు? వాడిని చూడని ఈ కనులెందుకు? వాడి గాఢ పరిష్వంగానికి నోచని ఈ శరీరమెందుకు?

ఓ కౌసల్యా! నేను శోకమనే మహాసముద్రంలో మునిగి పోతున్నాను.

రామ శోకమే దీని వైశాల్యము.

సీత దగ్గరలేకపోవడమే ఆవలి ఒడ్డు.

నా నిట్టూర్పులే తరంగాలు.

నా కన్నీళ్ళే నీటి సుడులు.

కైకేయి ఈ సముద్రంలో పుట్టిన బడబాగ్ని,

మంధర అతిపెద్ద మొసలి,

రామా, రామా, రామా రామా నిను విడిచి ఉండలేనురా అంటూ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయాడు దశరథుడు.

తలచుకుంటూ ఉంటే హృదయం బరువెక్కిపోతోంది కౌసల్యకు. తన పుణ్యాలప్రోవు, తన వరాలమూట.. జగదేక వీరుడైన రాముడు చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాడనే ఆలోచన ఆవిడ గుండెల్ని పిండివేస్తోంది!

దీనికి కారణం దశరథుడు!

తన భర్త యొక్క అనాలోచిత చర్య!

ఆవిడ బాధ అంతా దశరథుడి మీద కోపంగా మారి పోయింది.

రాజా!... నీకు మూడులోకాలలో కీర్తి ఉండిన ఉండవచ్చు కానీ, నీవు చేసిన ఈ తెలివితక్కువ పనివలన అది అంతా తుడిచిపెట్టుకుపోయింది.

నీ కొడుకులిద్దరూ నీ పనికిమాలిన కోరిక వలన అడవుల పాలైనారే! కష్టమంటే ఏమిటో తెలియని రాకుమారులు అడవులలో క్లేశాలను ఎలా భరించగలరనుకొని పంపావయ్యా!

ఇంతవరకు భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయాదులతో బహుపసందైన భోజనమారగించే ఆ జనకుడి కూతురు అడవులలో దొరికే నివ్వరిధాన్యాలు, వెదురుబియ్యాలతో ఆకలి ఎలా తీర్చుకుంటుంది?

సుప్రభాతవేళలో మంగళవాయిద్యాలను శ్రవణానందకరంగా వింటూ నిదురలేచే ఆ రాకుమారి... నేడు అడవి అంతా ప్రతిధ్వనించే సింహశార్దూల గర్జనల భయంకరధ్వనికి ఉలిక్కిపడి నిదురలేవాలి కదయ్యా!

ఎంతటి దయమాలినవాడవయ్యా నీవు!

పట్టుపరుపులమీద మెత్తని దిండ్లు తలగడగా పెట్టుకొని హాయిగా నిదురించే నా కుమారుడు నేడు పరిఘవంటి తన బాహువులనే తలగడగా పెట్టుకొని నిదురించాలి గదయ్యా!

ఎంత తెలివిమాలినపని చేశావయ్యా!.

నీవు సుఖం అనుభవించటానికి నా కొడుకులను సుఖానికి దూరంచేశావు కదా!.

రాముడు తిరిగి వచ్చినప్పుడు తన తమ్ముడు అనుభవించిన రాజ్యలక్ష్మిని తాను తిరిగి చేపడతాడా?

ఇంకొకరి మృగం ముట్టిన ఆహారం పెద్దపులి తాను ముట్టదు.

నరశార్దూలము నా రాముడు!

వాడు ఇంకొకరిచేత ఎంగిలి చేయబడ్డ కూడు ఆశించడు.

ఆత్మాభిమానం కల రాముడు ఈ అవమానం సహించడు.

కేవలం తండ్రి అనే గౌరవంతో నిన్ను ఏమీ చేయలేదు.

వాడి కోపం ముల్లోకాలను ముంచెత్తగలదు!

వాడి బంగారు బాణాలు సకలభూతాలను ప్రళయకాలంలోని అగ్ని లాగా దహించివేయగలవు.

వాడి శస్త్రాస్త్రాలు మహాసముద్రాలనే ఇంకింపచేయగలవు, వాడు కన్నెర్రచేస్తే నీవెక్కడ ఉండే వాడివి?

పెద్దపులి తోకను తాకితేనే తాకినవారిని నిలువునా చీల్చివేస్తుంది! ఈ అవమానం నా రాముడు భరింపగలడా?

చేపలు తమ పిల్లలను తామే తింటాయి.. అలాగే నీ పిల్లల సౌభాగ్యాన్ని నీవే నాశనం చేశావు కదయ్యా!

వాడు ఏ నేరం చేశాడో చెప్పు?

ధర్మానికి కట్టుబడి నడుచుకోవటమే వాడి బలహీనత అయ్యింది నేడు!

ధర్మమూర్తికి ఉత్తపుణ్యానికి రాజ్యబహిష్కరణ శిక్ష విధించి బికారిలాగ ఇంటినుండి వెడలగొట్టావు కదా!

ఇది శాస్త్ర సమ్మతమేనా?!

సనాతన ధర్మమేనా?!

పడతికి పతి, పుత్రుడు, జ్ఞాతి ఈ ముగ్గురే గతి!

మొదటి గతి, నీవా ఉండీ నాకు లేనట్లే!

నా కొడుకును చూసుకొని ఉందామంటే వాడిని అడవుల పాలు చేశావు!

అన్ని విధాలుగా నన్ను గతిలేని దానిని చేశావు కదయ్యా... అంటూ తన హృదయవేదనను బహిర్గతం చేసింది కౌసల్యాదేవి!

రాణీ కౌసల్య పేల్చేమాటల తూటాలు దశరథుడి హృదయ కవాటాలను ఛేదిస్తున్నాయి. ఆవిడ పలికే ఒక్కొక్క పలుకు ముల్లుకై గుండెలను గుచ్చుతున్నాయి. పాపం ఆ ముసలి రాజు తట్టుకో లేకపోతున్నాడు. ఇంద్రియాలు పట్టుతప్పుతున్నాయి. మాటిమాటికి మూర్ఛిల్లుతున్నాడు మరల తేరుకుంటున్నాడు.

కౌసల్యా! పూర్వమెప్పుడో నేను చేసిన పాపం నన్ను పట్టి పీడిస్తోంది. నీ వంటి ధర్మదృష్టిగల వనితాశిరోమణి, పెద్ద-చిన్న తారతమ్యం తెలిసినదానివి, ఎంత దుఃఖంలో ఉన్నప్పటికీ భర్తను నిందించడం నీవంటిదానికి తగునా!.

పల్లెత్తుమాట ఏనాడూ తను తన భర్తను అని ఎరుగదు.

ఈనాడు తనకీ దురవస్థ సంప్రాప్తించిందని ఇన్నిమాటలు అన్నానే! అని ఒక్కసారిగా ఉబికిఉబికివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ భర్తచేయిని తన తలమీద ఉంచుకొని, రాజా నీవు ఒక్కమాటతో నన్ను ప్రాణంలేని దానిని చేశావు గదయ్యా!.

నేను క్షమార్హం కాని అపరాధం చేసినాను.

మహారాజా నాకు ధర్మాలన్నీ తెలుసు.. నీవు ధర్మం తప్పనివాడవనీ తెలుసు. అయినా, నన్ను ఆవరించిన శోకం నాలోని, ధైర్యాన్నీ, విజ్ఞతను, శాస్త్రపరిజ్ఞానాన్నీ, నశింప చేసిందయ్యా. శోకాన్ని మించిన శత్రువు లేదు కదా!

**శోకో నాశయతే ధైర్యం శోకో నాశయతే శృతమ్**
**శోకో నాశయతే సర్వం నాస్తి శోక సమో రిపుః**

శత్రువుకొట్టిన దెబ్బనైనా సహింపవచ్చును కానీ హఠాత్తుగా వచ్చి మీదపడిన శోకాన్ని అది ఎంత చిన్నదైనా కానీ తట్టుకోవడం కష్టం.. ఓ వీరుడా! ధర్మవేత్తలూ, శాస్త్రజ్ఞులు, అన్ని సంశయాలు తొలగిన సన్యాసులు కూడా శోకాన్ని తట్టుకోలేరయ్యా!

ఓ నా ప్రాణనాథా! నా ప్రియపుత్రుడు అడవికి వెళ్ళి నేటికి అయిదవరోజు అయినా నాకు అయిదు సంవత్సరాలు లాగా ఉంది. రాముడిని తలుచుకుంటున్నకొద్దీ నాలో దుఃఖం కట్టలు తెంచుకొంటున్నదయ్యా!... అని తన మనసులోని వేదనను వెలిబుచ్చింది కౌసల్య.

వీరిలా మాట్లాడుకుంటూనే ఉన్నారు, సమయమెంత గడిచిందో ఇరువురికీ స్పృహలేదు. సూర్యకిరణాల వెలుగు మసకబారి రాత్రి వచ్చింది. శోకంతోటే నిద్రలోకి జారుకున్నాడు దశరథుడు.

ఆ నిదుర కలతనిదుర.

కౌసల్యా! మూఢత్వం మూర్తీభవిస్తే అది దాల్చే రూపం నేనే! కౌసల్యా! బాలుడు మూఢుడూ ఒకటే! (పిల్ల చేష్టలంటామే అవి).

**గురులాఘవమర్థానామారమ్భే కర్మణాం ఫలమ్**
**దోషం వా యో న జానాతి స బాల ఇతి హోచ్యతే**

ఒక పని చేసేటప్పుడు మంచి, చెడ్డలు ఎంచి చూడకుండా, దాని వలన కలిగే ఫలితాన్నిగానీ, అందులో ఏదైనా దోషముంటే గ్రహించకుండా ఎవడు ప్రవర్తిస్తాడో వాడు "బాలుడు" (మూఢుడు).

..(సశేషం)

# యువతా!.. మీరే ఉద్యోగాలివ్వండి

## ప్రోత్సాహకరంగా రాష్ట్ర పారిశ్రామిక విధానం

ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఐదేళ్ల పాటు అలమటించిన ఆంధ్రప్రదేశ్ యువతరం కోసం చంద్రబాబునాయుడు ప్రభుత్వం 'జాబ్ ఫస్ట్' నినాదంతో ఆరు కొత్త విధానాలను, వీటికి అదనంగా, ప్రత్యేకంగా ఐటీ విధానాన్ని తీసుకొచ్చింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అదనంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పరిశ్రమలు, సంస్థలు అత్యంత వేగంగా ఏర్పాటు కావడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దోహదపడుతుంది. దీనివల్ల పరిశ్రమలు, సంస్థల ఏర్పాటుకు కావాల్సిన అనుమతుల కోసం పది మంది అధికారుల చుట్టూ, పది మూలలకు తిరగాల్సిన అవసరం లేకుండా సింగిల్ డెస్క్ ద్వారా అనుమతులు తెచ్చుకోవచ్చు. నిర్దేశిత గడువులోపు ఆ డెస్క్ నుంచి అనుమతి రాకపోతే అనుమతి వచ్చినట్లే భావించొచ్చని ముఖ్యమంత్రి స్పష్టం చేయడం పరిశ్రమ వర్గాలకు నిజంగా శుభవార్తే. పారిశ్రామికాభివృద్ధి, ఎంఎస్‌ఎంఈ అండ్ ఎంట్రప్రెన్యూయర్ డెవలప్‌మెంట్ పాలసీ, ఆహారశుద్ధి, ఎలక్ట్రానిక్స్, ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల విధానం, సమీకృత శుద్ధ విద్యుత్ విధానాల ద్వారా రాబోయే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. వచ్చే ఐదేళ్లలో ఐటీ రంగంలో 2లక్షల ఉద్యోగాల కల్పన, రూ.20వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముసాయిదా ఐటీ విధానాన్ని కూడా సిద్ధం చేసింది.

### సృజనాత్మకతతో ముందుకు సాగాలి :

రాష్ట్రంలో ఉత్సాహవంతులైన యువతకు కొదవ లేదు. వారిలో సృజనాత్మకతకు కొరత లేదు. వారికి కావాల్సిందల్లా తగిన ప్రోత్సాహకర వాతావరణం, వారు అనుకున్న ఆలోచనలను ఆవిష్కరణ రూపంలోకి తీసుకురావడానికి తగిన ప్రయోగాత్మక వేదిక. కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన ఇన్నొవేషన్ హబ్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. ఇలాంటి ఆవిష్కరణ కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌కు దీర్ఘకాలికంగా ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యమంత్రి తాజాగా ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత



రతన్ టాటా పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో అయిదు నవ్యావిష్కరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వీటికి ప్రధాన కేంద్రంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ఉంటుందని ఆయన ప్రకటించారు. రాష్ట్ర యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు కల్పించే వారిగా ఎదగాలనే సత్సంకల్పంతో తాము తగిన ప్రోత్సాహకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త వచ్చేలా కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు.

### అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

యువతరం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యాపారం మౌలిక స్వభావమేమిటో అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం కూడా దానిని వివరించడానికి రాష్ట్రం నలుమూలలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా కళాశాలల్లో వాటిని ఏర్పాటు చేయాలి. నిత్యం మనం ఎదుర్కొనే సమస్యలకు తగిన పరిష్కారం చూపించడమే వ్యాపారం మౌలిక స్వభావం. లేదా మన జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చే ఆలోచనే వ్యాపారమంటే. మన సమాజంలో సమస్యలకు కొదవ లేదు. ఎప్పటికప్పుడు కొత్తగా సమస్యలు వస్తూనే ఉంటాయి. యువతరం ఆ దిశగా ఆలోచిస్తే తమ వ్యాపార ప్రస్థానానికి శ్రీకారం చుట్టినట్లే. ఇటీవల అమరావతిలో డ్రోన్ల ప్రదర్శన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ యూజ్ కేసెస్ (ఏయే రంగాల్లో ఏయే సమస్యలకు, అవసరాలకు ఎలా వినియోగించవచ్చు)తో వస్తే తాము పరిశీలించి ప్రోత్సహిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ల హబ్‌గా అభివృద్ధి చేస్తామని, దేశంలో డ్రోన్ల ఆవిష్కరణ, తయారీ, సేవలకు ఏపీ కేంద్రంగా ఉంటుందని తెలిపారు.

ఆయన మాటల నుంచి యువతరం గ్రహించాల్సిందేమిటంటే.. ఏ రంగంలో అయినా సరే సమస్యలకు, అవసరాలకు, సౌకర్యవంతమైన జీవనానికి తగిన పరిష్కార మార్గాలతో, నవ్యావిష్కరణలతో వస్తే వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తగిన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ఏదేమైనా, మనమింకా ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు, పొరుగు దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందులో యువతరం ముఖ్య భాగస్వాములు కావాలి. వివిధ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉత్పత్తితో పోల్చుకుంటే మన దేశంలో ఉత్పత్తి వాటా చాలా తక్కువ. మనకు తగినన్ని సహజ వనరులున్నాయి. ఉత్పత్తి రంగంలో చాలా అవకాశాలున్నాయన్న సంగతిని యువతరం గుర్తించి పారిశ్రామికవేత్తగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్



## సీఎంను కలిసిన పనబాక దంపతులు

టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా తనను నియమించడంతో ఇటీవల అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పనబాక లక్ష్మి – పనబాక కృష్ణయ్య దంపతులు.

# ట్రంప్ ఈజ్ బ్యాక్

(మొదటిపేజీ తరువాయి)

'ఇకపై ప్రతిక్షణం మీ కోసం, మీ కుటుంబం కోసం, మీ భవిత్యం కోసం వెచ్చిస్తా.. అమెరికాకు స్వర్ణయుగాన్ని తీసుకువస్తా'నంటూ ట్రంప్ తన విజయానంతర వేదికపై హామీ ఇవ్వడంతో అమెరికన్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల వెల్లడి ప్రక్రియ అంతా పూర్తయి ట్రంప్‌ను అధ్యక్షునిగా అధికారికంగా ప్రకటించాక, జనవరి 20న ఆయన ప్రమాణస్వీకారం చేసి, రెండవసారి శ్వేతసౌధంలోకి అడుగు పెట్టనున్నట్లు సమాచారం.

### ఫలించని కమల పోరాటం

అమెరికా అధ్యక్షునిగా బైడెన్ హయాంలో ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు, పలు అసంతృప్తులు, పాలనాపరంగా లోటుపాట్లు, కొన్ని ఆటుపోట్లు కమలా హారిస్ ఎన్నికపై ప్రభావం చూపాయని కూడా ఆమె ఓటమిపై విశ్లేషకుల అంచనా. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఆమె ఎన్నికల రంగంలోకి రావడం, వచ్చీరాగానే దూకుడుగా వ్యవహరిస్తూ ట్రంప్‌పై గెలుపు దిశలో పయనం సాగినా, చివరికి ఓటమినే చవిచూడాల్సి వచ్చింది. కీలకంగా పేర్కొనే ఏడు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్ పైచేయి సాధించడంతో ఆయన గెలుపు ఖరారైపోయింది. ఏదేమైనా, అమెరికా రాజకీయాల్లో పురుషాధిక్యత కారణంగా, మహిళలకు ఆశించిన విజయాలు లభించడం లేదని కూడా కొంతమంది రాజకీయ విశ్లేషకుల వాదన. అమెరికా చరిత్రలోనే ఉపాధ్యక్షురాలి పదవిని ఒక మహిళ పొందగలగడం కమలా హారిస్‌తోనే ప్రారంభమైంది. అయితే, గతంలో జరిగిన ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్ ఓడిపోవడం, ఇప్పుడు కమలా హారిస్ కూడా గెలుపొందలేకపోవ దంతో 'అమెరికా అధ్యక్ష పదవి'..అనేది మహిళలకు సుదూర స్వప్నం కావచ్చేమోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ట్రంప్‌కు సవాళ్లు సిద్ధం

ఇప్పటికే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్–గాజా సమరంతో పశ్చిమాసియా అట్టుడికిపోతున్న నేపథ్యంలో, ట్రంప్ అమెరికా పగ్గాలు చేపట్టిన తర్వాత అనేకరకాల సవాళ్లు సిద్ధంగా ఉన్నాయి. ట్రంప్ వైఖరి.. ఆ తెంపరితనం ఆయా దేశాల పట్ల తీసుకునే విధాన నిర్ణయాలు ఎంతటి ప్రభావం చూపుతాయోనని ప్రపంచదేశాల నేతల్లో చర్చగా ఉంది. ఏదేమైనా... తాను అనుకున్నట్లుగా, అమెరికాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెడతానని హామీ ఇవ్వడం, యుద్ధాల జోలికి వెళ్లకుండా..యుద్ధాలను ఆపేలా చూస్తానని చెప్పడం ట్రంప్ విజ్ఞతకు, నిబద్ధతకు నిదర్శనం.

### భారత్‌తో బలపడనున్న చెలిమి



ట్రంప్‌కు మనదేశంతో మంచి అనుబంధం ఉంది. ప్రధాని నరేంద్రమోడీతో ఆయనకు సాన్నిహిత్యం ఉండడంతో, ట్రంప్ విజయంతో భారత్‌పై సానుకూల ప్రభావం ఉంటుందని, భారత్–అమెరికా చెలిమి మరింత బలపడుతుందని భావిస్తున్నారు. ట్రంప్‌తో మోడీ స్నేహం అపూర్వం. అందుకే, ట్రంప్ విజయం ఖరారైనవెంటనే మోడీ సంతోషం ప్రకటిస్తూ, 'నా స్నేహితుడు డొనాల్డ్ ట్రంప్ అద్భుతమైన, చరిత్రాత్మకమైన విజయం సాధించాడంటూ' ట్రంప్‌కు అభినందనలు తెలిపారు. అదేవిధంగా ట్రంప్ కూడా స్పందిస్తూ, భారతదేశం ఒక అద్భుతమైన దేశం.. మీరో అద్భుతమైన వ్యక్తి. భారతదేశాన్ని ఒక నిజమైన స్నేహితునిగా భావిస్తున్నానంటూ' సంతోషించారు. 'నేను గెలిచిన తర్వాత నాకు ఫోన్ చేసిన ప్రపంచ నాయకుల్లో మోడీయే ముందున్నారంటూ' ట్రంప్ అభినందించారు.

### ఉపాధ్యక్షుడు వాన్స్.. ఆంధ్రా అల్లుడే



అమెరికా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జేడీ వాన్స్ మన తెలుగునేల.. అందులోనూ ఆంధ్రా అల్లుడు కావడం విశేషం. వాన్స్ సతీమణి ఉష చిలుకూరి.. పూర్వీకుల స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలంలోని వడ్లూరు గ్రామం. ఉష తల్లితండ్రులు గతంలోనే అమెరికాలో స్థిరపడ్డారు. ఉష పుట్టింది కూడా అక్కడే. ఆమె బాల్యమంతా అమెరికాలోనే జరిగింది. ఉన్నత చదువులు కూడా పూర్తయ్యాక, పదేళ్లక్రితం ఆమెకు వాన్స్‌తో పెళ్లి జరిగింది. వారిది ప్రేమవివాహం. వాన్స్ ఇప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడు కావడంతో, అమెరికా సెకండ్ లేడీ (రెండో మహిళ)గా ఉష పేరొందడం దేశానికే కాక.. ముఖ్యంగా తెలుగుప్రజలకు మరింత గర్వకారణం.

# కూటమి పాలనలో కాక మొదలయ్యింది

**కూటమి ప్రభుత్వం ఏర్పడి అయిదు నెలలు పూర్తి కావస్తోంది. ఇన్నాళ్ళూ స్తబ్దుగా వున్న పాలనలో కాక మొదలయ్యింది. వరుస సమీక్షలతో క్షణం తీరికలేని కార్యాచరణతో పాలన, ప్రక్షాళనలపైన చంద్రబాబు దృష్టిపెట్టారు. రాష్ట్ర పర్యటనలతో, ఢిల్లీ భేటీలతో, సభలు, సమావేశాలతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూకుడు పెంచారు.**



రాజకీయాలలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఏ క్షణాన ఎలాంటి బాంబు పేలుతుందో అర్థంకాదు. మిత్రులు శత్రువులుగా, శత్రువులు మిత్రులుగా మారడం పాలిటిక్స్‌లో సర్వసాధారణం. ముఖ్యంగా కొన్ని పార్టీలు సమూహంలా ఏర్పడి ఒకే గొడుగు కిందకు చేరినప్పుడు ఒక్కొక్కసారి ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటాయి. అలాంటి పరిణామమే ఆంధ్ర రాజకీయాలలో జరగాలని కోరుకునేవారికి నిరుత్సాహమే ఎదురవుతోంది. బీజేపీ–టీడీపీ–జనసేన కలయికతో ఏర్పడిన కూటమిలో చీలికలు రావాలని ఆశించేవారికి భంగపాటు కలిగేలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వ్యవహరిస్తున్నారు. రెండు పార్టీలలో ఎవరు తప్పు చేసినా నిర్మొహమాటంగా చివాట్లు పెడుతున్నారు. సొంత పార్టీ లేదా సహచర పార్టీ నాయకులపైనా, మంత్రులపైనా అసంతృప్తి ఉంటే బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు.

### భరతం పడతానంటున్న చంద్రబాబు

ఈ అయిదునెలల కాలంలో ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి సమావేశంలో టీడీపీతో సహా కూటమి పార్టీల నాయకులకి కూడా తరచూ హెచ్చరికలు చేస్తూనే వున్నారు. క్యాబినెట్ మీటింగులలో సైతం నాయకుల పనితీరుని ప్రస్తావిస్తున్నారు. నియోజకవర్గాల్లో జరుగుతున్న లోపాలని ఎత్తి చూపుతున్నారు. పాలనా పరంగా క్రిందిస్థాయిలో ఉన్న పొరపాట్లనుసైతం గుర్తించి సరిచేయాలని ఆదేశిస్తున్నారు. అదే క్రమంలో పార్టీ పరంగా కూడా దృష్టిపెట్టి పనిచేయాలని, ద్వితీయ శ్రేణి నాయకులని, కార్యకర్తలని నిర్లక్ష్యం చేయొద్దని సూచిస్తున్నారు. పార్టీ సమావేశాలలో కూడా క్యాడరుకి హితబోధ చేస్తున్నారు. ప్రజల మనసు తెలుసుకుని పనిచేయాలని పిలుపునిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టంగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. తన సొంత పార్టీకి చెందిన తూర్పు గోదావరి రామచంద్రపురం ఏం.ఎల్.ఏ మరియు మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని నిర్మొహమాటంగా చివాట్లు పెట్టారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని క్లాసు పీకారు. ఎవరైనా తప్పు చేసినా, క్రమశిక్షణతో పనిచేయకపోయినా ఇదే విధంగా ఉంటుందని పార్టీ నాయకులకి, క్యాడర్‌కి సంకేతాలు ఇచ్చారు. అధికార యంత్రాంగం కూడా ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయాలని వార్నింగ్ ఇస్తున్నారు. తాను 94నాటి ముఖ్యమంత్రిలా పనిచేయాలనుకుంటున్నానని.. అందరూ తనకి సహకరించాలని కోరుతున్నారు. ఎవరైనా తోకాడిస్తే కత్తిరిస్తానని కూడా మందలిస్తున్నారు.

### పవర్ చూపిస్తానంటున్న పవన్

ఇక ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఒక్కసారిగా స్పీడు పెంచారు. మొదటి నాలుగు నెలలూ సౌమ్యంగా కనిపించిన పవర్‌స్టార్ ఉన్నట్టుండి తన వైఖరిని మార్చుకున్నారు. ఇన్నాళ్ళూ కేవలం తనకి కేటాయించిన శాఖలకే పరిమితమైన పవన్.. ఇప్పుడు ఇతర శాఖలపైన కూడా దృష్టిపెట్టారు. పర్యటనల సంఖ్య పెంచారు. సభలలో మాట్లాడే తీరు మార్చారు. తిరుమలలో జరుగుతున్న అక్రమాలపై తీవ్రంగా స్పందించారు. సనాతన ధర్మం గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో అసభ్యంగా పోస్టింగులు పెడుతున్న వారిపై కన్నెర్ర చేస్తున్నారు. మైనర్ బాలికలని మానభంగం చేసిన వారి విషయంలో మెతక వైఖరి అవసరమా అంటూ ప్రశ్నిస్తున్నారు. తప్పుచేసిన వారిని శిక్షించడంలో ఆలస్యం జరగడాన్ని నిలదీస్తున్నారు. మీకు చేతకాకుంటే హోంశాఖని కూడా నేనే తీసుకోవాల్సి వస్తుంది అంటూ, హోంమంత్రి అనితకి పరోక్షంగా చురకలు అంటించారు. గీత దాటితే వేటు వేస్తామని తమ పార్టీ వారైనా వదిలే ప్రసక్తే లేదని నిక్కచ్చిగా చెప్పున్నారు. పార్టీ అంతర్గత విషయాలు బహిర్గతం చేస్తే క్షమించే ప్రసక్తేలేదని పార్టీశ్రేణులని హెచ్చరించారు. టీడీపీ – బీజేపీ – జనసేన ఎప్పటికీ కలిసే ఉంటాయని, తమ మధ్య అభిప్రాయబేధాలు తేవాలని చూసేవారి కోరిక తీరదన్నారు. చంద్రబాబునాయుడు లాంటి కార్యదక్షత ఉన్న నాయకుడు ఆంధ్ర ముఖ్యమంత్రిగా ఉండడం ఆంధ్రుల అదృష్టం అంటూ కితాబు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చాన్నాళ్ళకి మొన్న ఢిల్లీ వెళ్లి హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఆంధ్రాలో శాంతి భద్రతల విషయంపై ఆయనతో చర్చించారు.

### టీడీపీ - జనసేన పార్టీలలో జోష్!

అటు బాబు.. ఇటు పవన్‌ల వ్యవహార సరళి ఇప్పుడు కూటమి పార్టీల శ్రేణులలో చర్చనీయాంశంగా మారింది. తమ నాయకులు ఇద్దరూ ఒక్కసారిగా వేగం పెంచారని మాట్లాడుకుంటున్నారు. ఉన్నట్లుండి కూటమిలో కాక పెరిగిందని చర్చించుకుంటున్నారు. రాబోవు రోజుల్లో ఊహించని మార్పులు ఇంకా చాలా జరగబోతున్నాయని చెవులు కొరుక్కుంటున్నారు. టార్గెట్ జమిలి లేదా టార్గెట్ 2029 అన్న లక్ష్యంతో తమ నాయకులిద్దరూ ప్రణాళిక రచించుకుని ముందుకు వెళ్తున్నారని సంతోషపడుతున్నారు. ఇదే క్రమంలో వైసీపీని పూర్తిగా నిర్వీవం చేసే దిశగా తమ నేతలు వ్యూహం రచించాలని కోరుకుంటున్నారు. అధినేతలిద్దరూ వ్యవహరిస్తున్న తీరు రెండు పార్టీలలో జోష్ పెంచిందని సంబరపడుతున్నారు!

## అనపల్లి అశోక్‌రెడ్డి సతీమణి

# సులోచనమ్మ కాలధర్మం



జిల్లావాసులకి సుపరిచితులు.. ప్రముఖ వ్యాపారవేత్త, అనపల్లి కన్వెన్షన్ సెంటర్, సీజన్స్‌ఇన్ హోటల్ వ్యవస్థాపకులు అనపల్లి అశోక్‌రెడ్డి సతీమణి శ్రీమతి సులోచనమ్మ నవంబర్ 4వ తేదీ ఆకస్మికంగా చెన్నైలో కన్నుమూశారు. సోమవారం సాయంత్రం ఆమె తీవ్ర గుండెపోటుకి గురై తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 71 సంవత్సరాలు. మనుబోలు మండలం వెంకన్నపాలెం ఆమె స్వగ్రామం. ఆమె చిట్టమూరువారి ఆడపడుచు. 1972 ఫిబ్రవరి 10న అశోక్‌రెడ్డిని పెళ్ళాడి అనపల్లివారి కోడలయ్యింది. సులోచనమ్మ చాలా సౌమ్యురాలు. సున్నిత మనస్కురాలు. వ్యాపారరీత్యా అశోక్‌రెడ్డి కుటుంబం చెన్నైలో స్థిరపడినా సులోచనమ్మకి కోవూరు అంటేనే మక్కువ. కోవూరులో ఉండడానికే ఆమె ఎక్కువగా ఇష్టపడేవారు.

ఆమెకి అపారమైన భక్తి. నెల్లూరు దర్గామిట్టలోని కృష్ణ మందిరంలో లక్ష్మీదేవి ఆలయాన్ని సులోచనమ్మే నిర్మింపచేశారు. అంతే కాకుండా ఇనుమడుగు ఆశ్రమానికి ఆమె తన చేయూతనందిస్తూనే ఉంటారు. అక్కడ నిత్యం జరిగే అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సులోచనమ్మే దాత. చెన్నైలో వున్నా నిత్యం పూజాకార్యక్రమాలని, వ్రతాలని నిర్వహిస్తూనే ఉండేవారు. సోమవారం తన భర్త అశోక్‌రెడ్డితో మాట్లాడుతూనే తుదిశ్వాస విడిచి సునాయాస మరణం పొందారు. ఆమెకి ఇద్దరు కుమారులు రమేష్, కమల్ ఉన్నారు. 52 సంవత్సరాలు తన కష్టసుఖాలలో పాలుపంచుకున్న ఇంటి ఇల్లాలిని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న అశోక్‌రెడ్డికి, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని దైవాన్ని ప్రార్థిస్తోంది 'లాయర్'.

### వేమిరెడ్డి దంపతుల పరామర్శ

సతీమణిని కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న అనపల్లి అశోక్‌రెడ్డిని గురువారం సాయంత్రం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు పరామర్శించారు. కోవూరులోని ఆయన నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.



# సురేష్‌కు.. లోకేష్ అభినందన

ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందన లభించింది. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులు పెట్టే విదేశీ సంస్థలను ఆహ్వానించేందుకు లోకేష్ అమెరికా వెళ్ళారు. వారంరోజుల పాటు ఆ కార్యక్రమాలు జయప్రదంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు..దివంగత నేత నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ ఏర్పాట్లను కాకర్ల సురేష్ దగ్గరుండి నిర్వహించారు. లోకేష్ పర్యటన విజయవంతం కావడంతో, తిరిగి స్వదేశానికి బయలుదేరిన లోకేష్‌కు న్యూయార్క్‌లోని విమానాశ్రయంలో కాకర్ల సురేష్ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో శ్రద్ధ చూపిన సురేష్‌ను లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు.




# 8 నుంచి వేడుకగా..'లక్ష దీపోత్సవం'

## ఆహ్వానపత్రికలను ఆవిష్కరించిన వేమిరెడ్డి దంపతులు

కార్తీక మాసం సందర్భంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నెల్లూరు వీఆర్‌సీ మైదానంలో పెద్దఎత్తున ఆధ్యాత్మిక సంబరాలు జరుగనున్నాయి. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి ఇటీవల ఆవిష్కరించారు. ఈ వేడుకలో భాగంగా ఈనెల 8వ తేదీ సాయంత్రం 7.30 గంటలకు 'ప్రవచన చక్రవర్తి' చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఉంటుందని, 9వ తేదీ రాత్రి 8 గంటలకు పూజ్యశ్రీ రామానంద భారతి స్వామివారి అనుగ్రహభాషణం, 10వ తేదీ సాయంత్రం 7.30 గంటలకు పూజ్యశ్రీ దత్త విజయానందతీర్థస్వామీజీ అనుగ్రహ భాషణం ఉంటాయని, ప్రతిరోజూ విశేషపూజలు, హోమాలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. మూడురోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ లక్ష దీపోత్సవ కార్యక్రమాల్లో ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని శివపార్వతుల ఆశీస్సులు అందుకోవాలని వారు కోరారు.

# యువత సేవాభావంతో రాణించాలి

యువత సేవాభావంతో రాణించాలని నెల్లూరు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ చెప్పారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ..నెహ్రూ యువ కేంద్ర-నెల్లూరుశాఖ వారి ఆధ్వర్యంలో ఇటీవల నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(పెద్దాసుపత్రి)లో 'సేవ ద్వారా నేర్చుకోవడం' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆసక్తి కలిగిన నర్సింగ్ స్టూడెంట్స్‌ని ఎంచుకొని, 'మై భారత్ పోర్టల్'లో అనుసంధానం చేసి, వారి ద్వారా 120 గంటలు (నెల రోజులు) వైద్య సేవలు అందించడం, తద్వారా యువతలో సేవా భావాన్ని పెంచడం, దేశభక్తి పెంపొందించడం, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడేలా చూడడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ షేక్ మస్తాన్ బాషా, జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్రరెడ్డి, జిల్లా పీహెచ్‌పీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ గిరిజ, నెల్లూరు నర్సింగ్ స్కూల్ ట్యూటర్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డి 'ప్రత్యేక గ్రీవెన్స్'కు

# పోటెత్తిన ప్రజానీకం



సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ప్రజావిజ్ఞాపనల కార్యక్రమానికి జనం పోటెత్తివచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి 550కి పైగా అర్జీలు రావడం విశేషం. ఈ సందర్భంగా సోమిరెడ్డి అర్జీదారులను ఆత్మీయంగా పలకరించి వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాము మొదటగా వెంకటాచలంలో స్పెషల్ గ్రీవెన్స్‌డే నిర్వహించామని, వందలాది మంది ప్రజలు అర్జీలతో బారులుదీరారంటే, గత పాలకులు ప్రజల కోసం ఏస్థాయిలో పనిచేశారో అర్థమవుతోందని ఆయన విమర్శించారు. ఎక్కువగా పింఛన్లు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, రీసర్వేలో తప్పిదాలు, భూఆక్రమణలు సంబంధించిన సమస్యలపైనే వినతులు వచ్చాయన్నారు. ప్రతి ఊరిలో సచివాలయాలు పెట్టి, ఉద్యోగులను నియమించినా ఇన్ని సమస్యలు పేరుకుపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పుడు వచ్చిన అర్జీలన్నిటినీ అధికారులతో కలసి పరిశీలించి నెలరోజుల్లో సాధ్యమైనన్ని పరిష్కరించేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

## 'గుంతల రోడ్లకు'..మంచి రోజులొచ్చాయి

ఎట్టకేలకు గుంతల రోడ్లకు మంచిరోజులొచ్చాయి. కూటమి ప్రభుత్వం రోడ్ల బాగుకు సత్వర చర్యలు చేపడుతుండడంతో ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల మనుబోలు మండలంలోని మడమనూరు వద్ద రోడ్డుపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత అయిదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నిటినీ నాశనం చేశారని, ప్రజలకు అవసరమైన రోడ్ల సంగతిని అసలు పట్టించుకోలేదని విమర్శించారు.

## 'సూపర్ సిక్స్' అమలుతో..

# విపక్షం ఆరోపణలకు చెక్

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి




సూపర్ సిక్స్ పథకాలు అమలు కావడం లేదంటూ విపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలకు చెక్ పెడుతూ, దీపావళి కానుకగా అక్క చెల్లెమ్మలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, దీపం పథకాన్ని ప్రవేశపెట్టి మహిళాలోకానికి ఎనలేని సంతోషం కలిగించారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కోవూరు మండల కార్యాలయం ఆవరణలో ఆమె ఇటీవల ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ఖజానాపై 2,684 కోట్ల రూపాయల భారం పడుతున్నా.. పేద మధ్య తరగతి వర్గాలకు ఆర్థికంగా అండగా నిలవాలన్న ఉద్దేశంతో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేసే కార్యక్రమం చేపట్టారన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటీ 55లక్షల మంది ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం ద్వారా లబ్ధి పొందుతారన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ వంతున లబ్ధిదారులు ఏడాదికి మూడు విడతలుగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చన్నారు. మొదటి ఉచిత సిలిండర్‌ను మార్చి 31, 2025 తేదీ వరకు బుక్ చేసుకోవచ్చని, రెండవ సిలిండరు 31 జూలై వరకు, మూడవ సిలిండర్‌ను నవంబరు 30వ తేదీ వరకు బుక్ చేసుకోవచ్చని ఆమె వివరించారు. గ్యాస్ సిలిండర్ ఇంటికి చేరిన 48 గంటలలో లబ్ధిదారులు సిలిండర్‌కు చెల్లించిన డబ్బులు తిరిగి వారి ఖాతాలలో జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కోవూరు తహశీల్దార్ నిర్మలానంద బాబా, డెప్యూటీ తహశీల్దార్ నాజర్, ఎంపిడిఓ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### తాళ్ళపూడిలో..

# అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం

కార్తీకమాసం సందర్భంగా ఇటీవల ముత్తుకూరు మండలం తాళ్లపూడిలోని సాయిబాబా మందిరంలో అయ్యప్ప భక్తులకు, శివభక్తులకు, భవాని మాల వేసుకున్నవారికి మందిరం ధర్మకర్త, వైకాపా నాయకుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులు అన్నప్రసాదం(భిక్ష) పెట్టారు. మాజీ జడ్పీటీసీ నెల్లూరు శివప్రసాద్, రాగాల వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, సూరి పాల్గొన్నారు.

## యల్లాయపాలెంలో గ్రామసభ

కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామంలో ఇటీవల తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి భూముల రీ-సర్వేపై రైతులకు అవగాహన కలిగించారు. రీ-సర్వేలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్ఐ సునీల్‌రెడ్డి, సర్వేయర్ శ్రీలత, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మనుబోలు పార్వతమ్మశిల వద్ద.. నెల పొంగళ్ళు

మనుబోలులోని పార్వతమ్మశిల వద్ద ఈనెల 4న భక్తులు నెల పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పార్వతమ్మ అమ్మవారిని పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు బొమ్మిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటస్వామి, పెంచలయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

## కందుకూరులో సీజనల్ వ్యాధులపై అవగాహన

మండల కేంద్రమైన కందుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారిణి డాక్టర్ బ్యూలాగ్రేస్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ పట్ల అవగాహన కలిగించారు. ఆది ఆంధ్రకాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి స్థానికులకు ఆరోగ్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులిచ్చారు సబ్‌యూనిట్ ఆఫీసర్ రవిచంద్ర, పద్మావతి, పల్లవి, కోటేశ్వరి పాల్గొన్నారు.

## ఆత్మకూరు బీసీ హాస్టల్ తనిఖీ

ఆత్మకూరులోని బీసీ బాలికల వసతిగృహాన్ని ఇటీవల ఆర్డీఓ పావని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ వసతులు ఎలా ఉన్నాయో చూశారు. మెనూ సరిగ్గా అమలుచేస్తున్నారా లేదా అని పరిశీలించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి చెప్పారు. బాలికలతో మాట్లాడి వసతులు గురించి ఆరా తీశారు. వార్డెన్, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

## రాపూరులో 'సాక్షరత' కార్యక్రమంపై శిక్షణ

రాపూరులో ఇటీవల సాక్షరతా కార్యక్రమంపై వివోఏలు సీసీలు, వలంటీర్లకు వెలుగు అధికారులు శిక్షణ ఇచ్చారు. వయోజన విద్య డెప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్, ఏపిఎం రాధ మాట్లాడుతూ, మండలంలోని 932 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 92 మంది వలంటీర్లను ఎంపికచేశామని, సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని చెప్పారు.

## ఉప్పలపాడు వద్ద పేకాటరాయుళ్ళ అరెస్ట్

దగదర్తి మండలంలోని ఉప్పలపాడు సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురిని పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 12,200 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జంపానికుమార్ ఆధ్వర్యంలో పేకాటరాయుళ్ళపై కేసు నమోదు చేశారు.

## కాకుపల్లిలో.. 'పొలం పిలుస్తోంది'

నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లి గ్రామంలో ఈనెల 5న వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మేలైన సాగు విధానాలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగమోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు అభిలాష్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కొడవలూరు మండలం రామన్నపాలెం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈనెల 5న సూపర్‌వైజర్ నిర్మల పరిశీలించి, పిల్లల ఆరోగ్యం, పెరుగుదల విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రూంను తనిఖీ చేసి, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com